

సబ్‌కలెక్టరేట్ కార్యాలయం కిటికీ నుంచి బయటకు ఎగసిపడుతున్న మంటలు (ఫైల్)

ఆ ఎనిమిది కేసులు ఎవరిపైనో..?

- ఎఫ్‌ఎస్‌ఎల్ రిపోర్టు ఏమి వస్తుందో..?
- ఉత్కంఠగా మారిన సబ్ కలెక్టరేట్ ఫైళ్ల దహనం కేసు

మదనపల్లె టౌన్, జూలై 30: మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో ఫైళ్ల దహనం కేసుకు అనుసంధానంగా మరో ఎనిమిది కేసులు నమోదు చేసినట్లు కర్నూల్ రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ప్రకటించిన నేపథ్యంలో ఈ ఎనిమిది కేసులు ఏమిటి..? ఎవరి మీద నమోదు చేశారు..? అన్న ప్రశ్నలు మదనపల్లె ప్రజల్లో చర్చనీయాంశంగా మారాయి. ఈనెల 21వ తేదీ రాత్రి మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో ఫైళ్ల దహనం సంఘటనను రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకున్న విషయం తెలిసిందే. సీఎం చంద్రబాబు ఆదేశాలతో డీజీపీ ద్వారకా తిరుమలరావు, సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ స్వయంగా వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించిన విషయం విదితమే. దీనిపై సీఐడీ సహకారంతో పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేశారు. ఈ క్రమంలో డీఐజీ ప్రవీణ్ మదనపల్లెలో ఇచ్చిన ప్రెస్‌మీట్‌లో మాజీ ఎమ్మెల్యే నవాజ్ బాషా ఇంట్లో ఉండకూడని పత్రాలు దొరికినట్లు, ఆయనపై కేసు నమోదు చేశామని చెప్పారు. దీంతో పాటు 52 మందిని విచారించగా, అందులో 15 మంది అనుమానితులను విచారించి సోదాలు చేశామన్నారు. వారి వద్ద ఉండకూడని కీలకపత్రాలు స్వాధీనం చేసుకుని ఎనిమిది కేసులు నమెదు చేశామన్నారు. వాస్తవంగా ఏదైనా నేరం జరిగితే ఆ నేరం చేసిన వ్యక్తులతో పాటు వారికి సహకరించిన, సాక్ష్యాలు, ఆధారాలు చెరిపేందుకు, దాచిపెట్టేందుకు ప్రయత్నించిన వారిపై కూడా కేసు కాస్పరసి సెక్షన్ 120-బి (కూడగట్టుకుని నేరం చేసిన) కేసు నమోదు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఫైళ్ల దహనంపై మదనపల్లె వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో క్రైమ్ నెంబర్ 135/2024 కింద నమోదైన కేసుకు, ఈ ఎనిమిది కేసులు కూడా తోడవుతాయనే కొందరు న్యాయనిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇదే జరిగితే 15 మంది అనుమానితుల్లో ఎవరిపై ఎనిమిది కేసులు నమోదు చేస్తారో అని సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

ఎఫ్‌ఎస్‌ఎల్ రిపోర్టు ఆధారంగానే మరిన్ని సెక్షన్ల నమోదు

సబ్ కలెక్టరేట్‌లో ఫైళ్ల దహనం ఘటనపై నాగ్‌పూర్ నుంచి నేషనల్ ఫోరెన్సిక్ సైన్సు ల్యాబ్ నిపుణులు వచ్చి ఘటన జరిగిన ప్రాంతంలో కాలిపోయి మిగిలిన అవశేషాల శాంపిల్స్ తీసుకున్నట్లు సమాచారం. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించలేదని విద్యుత్ సేఫ్టీ అధికారులు ఎంఆర్ఐ (మీటర్ రీడింగ్ ఇన్‌స్ట్రుమెంట్) డేటా విశ్లేషించి ప్రభుత్వానికి, పోలీసులకు నివేదికలు అందచేశారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఫైర్ అధికారులకు 11.47 గంటల సమయం సమాచారం అందగా ఐదు నిమిషాల్లోనే ఫైర్ బ్రిగేడియర్లు సబ్‌కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అప్పటికే అక్కడ పెద్దఎత్తున మంటలు వ్యాపించి కిటికీల్లో నుంచి మంటలు బయటకు వస్తుండటం ఫైర్ అధికారుల కంటపడింది. దీనిని బట్టి చూస్తే కార్యాలయం అంతటా వేగంగా మంటలు వ్యాపించినట్లు తెలుస్తోంది. ఇలా జరగడానికి హైలీ ఇన్‌ఫ్లేమబుల్ రసాయనాలైన గ్యాసోలిన్, పెయింట్ తిన్నర్, టర్పెంటైన్, శానిటైజర్, పెట్రోల్, స్పిరిట్ తదితర ఏవైనా ఉపయోగించారా అన్నది ఎఫ్ఎస్ఎల్ రిపోర్టులో తేలనుంది. సాధారణంగా ఎఫ్ఎస్ఎల్ రిపోర్టు వచ్చేందుకు నెల రోజులైనా సమయం తీసుకుంటారని తెలిసింది. కాకుంటే రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసు విషయం సీరియస్‌గా తీసుకోవడంతో వచ్చే పది రోజుల్లో ఎఫ్ఎస్ఎల్ రిపోర్టు వచ్చే అవకాశం ఉందని డీఐజీ చెప్పిన మాటల్లో తెలుస్తోంది. అదే వస్తే సాక్ష్యాధారాలతో పోలీసులు అసలు నిందితులను అరెస్టు చూపనున్నారు.



మంటల్లో కాలిపోయిన సబ్ కలెక్టర్ కార్యాలయంలోని రికార్డులు (ఫైల్)

కేవీపల్లెలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

పీలేరు, జూలై 30: కేవీపల్లె మండలంలో కలెక్టర్ చామకూరి శ్రీధర్ మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ముందుగా గర్నిమిట్టలోని పీహెచ్‌సీని తనిఖీ చేసి అందులోని అటెండెన్స్, ఓపీ, మెడిసిన్స్ రిజిష్టర్లను పరిశీలించారు. మందులు అన్నీ అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, పీహెచ్‌సీకి వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కేంద్రంలో ఎంతమంది పిల్లలు ఉన్నారు, ఎన్ని గంటలకు వారికి భోజనం పెడుతున్నారు, కేంద్రం పరిధిలో ఎంత మంది గర్భిణీలు, బాలింతలు ఉన్నారో తెలుసుకున్నారు. పిల్లలకు పౌష్టికాహారం అందించాలని ఆయన అంగన్‌వాడీ టీచర్‌ను ఆదేశించారు. నెలలో కనీసం రెండుసార్లు అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేయాలని అక్కడే ఉన్న గ్రామ పోలీసుకు సూచించారు. అనంతరం కస్తూర్బిబా గాంధీ బాలికా విద్యాలయాన్ని సందర్శించారు. విద్యాలయంలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థినులతో మాట్లాడి విద్యాబోధన, భోజన నాణ్యతను గురించి అడిగి తెలుసుకున్నారు. విశ్లేషణాత్మకంగా చదువుకోవాలని ఆయన ఈ సందర్భంగా విద్యార్థినులకు సూచించారు.



గర్నిమిట్ట పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రభుత్వ స్థలాలను రక్షించాలి

- ప్రజల సమస్యలు సకాలంలో పరిష్కరించాలి
- రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నిదియాదేవి

సుండుపల్లె, జూలై 30: ప్రభుత్వ స్థలాల పరిరక్షణలో నిర్లక్ష్యం చేయకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నిదియాదేవి తెలిపారు. మంగళవారం సుండుపల్లె తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు ఉన్న గదులను పరిశీలించారు. అనంతరం రెవెన్యూ, వ్యవసాయ, మండల పరిషత్‌కు సంబంధించిన అధికారులతో ఆమె మాట్లాడారు. రెవెన్యూ అధికారులు, సిబ్బంది ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని, ప్రభుత్వ స్థలాలు ఎక్కడ ఆక్రమణలకు గురైనా వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పలు సమస్యలపై వచ్చే అధికారులు ప్రజల సమస్యలను బాధ్యతాయుతంగా తీసుకుని పరిష్కరించాలని కోరారు. కౌలు రైతులకు కౌలు కార్డుల పంపిణీ వందశాతం పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ సిబ్బందిని ఆదేశించారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. అలాగే ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలని మండల పరిషత్ అధికారులకు తెలిపారు. అనంతరం వీఆర్‌వోలు ఎక్కడెక్కడ పనిచేస్తున్నారు. ఆ గ్రామాల్లోని రెవెన్యూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ రికార్డులు గల గదులను జాగ్రత్తగా ఉండేలా చూడాలని రెవెన్యూశాఖ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాసులు, ఇన్‌చార్జి ఎంపీడీవో సురేశ్‌బాబు, వ్యవసాయశాఖ అధికారి మహబూబ్‌బాషా, రెవెన్యూ, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ వైఖోమ్ నిదియాదేవి

బోనాలు మోసుకొస్తున్న మహిళలు



గంగమ్మకు బోనాలు

ములకలచెరువు, జూలై 30: మండలంలోని నాయనిచెరువుపల్లెలో మంగళవారం సమదుగు గంగమ్మ అమ్మవారికి పెద్దఎత్తున మహిళలు బోనాలు సమర్పించారు. ఆషాడ మాసం సందర్భంగా ప్రతి ఏడాది అమ్మవారికి బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. దీంతో మహిళలు భారీ సంఖ్యలో బోనాలు తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామం మొత్తం బోనాల కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

రికార్డుల భద్రతను పటిష్టం చేయండి

- సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

వాల్మీకిపురం, జూలై 30: రెవెన్యూ కార్యాలయంలో రికార్డుల భద్రత విషయంలో నిర్లక్ష్యం చేయకుండా పటిష్టంగా ఉండేలా చూసుకోవాలని మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఆయన వాల్మీకిపురం తహసీల్దార్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దాదాపు అరగంట పాటు రికార్డు గదిలోని రికార్డులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రికార్డు గదుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, విజిటర్స్ రిజిస్టర్ నిర్వహణ తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. విధుల విషయంలో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఫిరోజ్‌ఖాన్, సర్వేయర్ శ్రీనివాసులు, ఆర్ఐ శశికళ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



వాల్మీకిపురం తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

యాప్ నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలి


- ఆగస్టు 10 వరకు స్పెషల్ డ్రైవ్
- ప్రజాసమస్యలపై ప్రతి గ్రామంలో కాల్ సెంటర్ : డీపీవో ధనలక్ష్మి

మదనపల్లె టౌన్, జూలై 30: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో గ్రామ పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా పీఆర్-1 యాప్ నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా పంచాయతీ అధికారిణి (డీపీవో) ధనలక్ష్మి తెలిపారు. మంగళవారం స్థానిక డీఎల్‌పీవో కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కాల్‌సెంటర్ ఏర్పాటు పోస్టర్లను డీపీవో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె విలేకర్లతో మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి 15 రోజులకు ఒకసారి నివాసాల మధ్య ముళ్లపొదలు, కలుపుమొక్కలు, చెత్తాచెదారం ఫొటోలను జీపీఎస్ విధానంతో ఫొటోలు తీసి పీఆర్-1 యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. తరువాత వాటిని తొలగించాక ఆ ఫొటోలు కూడా తీసి యాప్‌లో పంపాలన్నారు. తాగునీటి పథకాలైన ఓవర్‌హెడ్ ట్యాంకులు, జీఎల్ఆర్ఎస్ ట్యాంకులను ప్రతిరోజు క్లోరినేషన్ చేయించాలన్నారు. డైరెక్ట్ పంపింగ్ ఉన్న చోట్ల బోరు నుంచి వచ్చే పైపుకు ప్రత్యేక పరికరం బిగించి క్లోరినేషన్ చేయించాలని తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఇచ్చే టెస్టింగ్ కిట్లతో తాగునీటిని పరీక్షించాలని, ఈ బాధ్యతఆయా గ్రామ సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లదే అన్నారు. అలాగే స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా జిల్లాలో 1.80 లక్షల మరుగుదొడ్లు నిర్మించారని వీటి నిర్వహణ ఎలా ఉందో సర్వేచేసి ఓడీఎఫ్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఈనెల 22 నుంచి మొదలైన ఈ స్పెషల్‌డ్రైవ్ ఆగస్టు 10వ తేదీ వరకు ఉంటుందని, పంచాయతీ కార్యదర్శులు అందరు బాధ్యతగా పనిచేయాలన్నారు. ముఖ్యంగా తాగునీరు, మురుగుకాలువలు, వీధిదీపాల నిర్వహణ సమస్యలపై ప్రతి గ్రామంలో కాల్ సెంటర్లు ఏర్పాటు చేశామని ప్రజలు నేరుగా ఈ కాల్ సెంటర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో నాగరాజు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కాల్‌సెంటర్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీపీవో, డీఎల్‌పీవో

నిబంధనలు నీళ్లపాలు



- రూ.10.80 కోట్లతో 21 సీపీడబ్ల్యుఎస్ స్కీంలకు పోటాపోటీగా టెండర్లు
- పేరుకు అన్‌లైన్ టెండర్లైనా.. అంతా రాజకీయ నిర్ణయమే
- అనుకూల కాంట్రాక్టర్లకు.. అధికారుల వత్తాసు

కడప(రూరల్), జూలై 30: ఉమ్మడి కడప జిల్లాలోని బహుళార్థ తాగునీటి సరఫరా పథకాల (సీపీడబ్ల్యూఎస్ స్కీం) టెండర్లలో రాజకీయం రసవత్తరంగా సాగుతోంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను కడప, అన్నమయ్య జిల్లాల్లోని 21 స్కీంల నిర్వహణ కోసం రూ.10.80 కోట్ల వ్యయంతో జడ్పీ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలు సంయుక్తంగా ఆన్‌లైన్ టెండర్లను పిలిచారు. స్కీంల నిర్వహణను దక్కించుకోవడానికి వైసీపీ, టీడీపీ నేతలు పోటాపోటీగా టెండర్లు వేశారు.
వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు ఇతర పార్టీల వారిని స్కీంల దరిదాపుల్లోకి రానియ్యకుండా వారే సొంతం చేసుకుంటూ వచ్చారు. ఒకవేళ ఎవరైనా పోటీకి వస్తే టెండర్లను పక్కనపెట్టి అగ్రిమెంట్ల ద్వారా దక్కించుకొంటూ వచ్చారు. అయితే పలు జడ్పీ సర్వసభ్య సమావేశాలలో ఆయా జడ్పీటీసీ సభ్యులు సీపీడబ్ల్యూఎస్ స్కీంల నిర్వహణ లోపభూయిష్టంగా ఉందని, లక్షల బిల్లులు బొక్కేస్తున్నా నీటిని మాత్రం సరిగా సరఫరా చేయడం లేదని మండిపడుతూ వచ్చారు. ఈ స్కీంలు ప్రజల దాహార్తిని తీరుస్తున్నాయో లేదో గానీ కాంట్రాక్టర్లు మాత్రం బాగుపడుతున్నారని, వీటిపై విచారణ జరిపించి వాస్తవాలను వెలుగులోకి తేవాలని బి.మఠం జడ్పీటీసీ, ఎంపీపీలు పలుమార్లు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో ఇటీవల వైసీపీ ఘోరంగా ఓటమిపాలై టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చింది. అయినప్పటికీ వైసీపీ నేతలు సీపీడబ్ల్యూఎస్ స్కీంల నిర్వహణను దక్కించుకోవడానికి తమకున్న పరిచయాల మేరకు పావులు కదుపుతున్నారు.

రెండు విడతలుగా టెండర్లు ఓపెన్

కడప, అన్నమయ్య జిల్లాల్లోని 21 సీపీడబ్ల్యూఎస్ స్కీంల నిర్వహణకు రూ.10.80 కోట్ల వ్యయంతో టెండర్లను పిలిచారు. ఇందులో రూ.50 లక్షలలోపు ఉన్న 12 సీపీడబ్ల్యూఎస్ స్కీంల టెండర్లను సోమవారం సాయంత్రం 4 గంటల తరువాత ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో ఓపెన్ చేశారు. అన్నమయ్య జిల్లాలోని హత్యరాల, బోయినపల్లి, చెర్లోపల్లి, ఆకేపాడు, మాధవరం-1, మాదవరం-2, పొందలూరు, పెనగలూరుతో పాటు.. కడప జిల్లాలోని కె.ఎర్రగుడి, వేంపల్లె, పులివెందుల అఫ్‌ల్యాండ్, కమలాపురం సీపీడబ్ల్యూఎస్ స్కీంల టెండర్లు ఉన్నాయి. వీటిలో కమలాపురం, ఆకేపాడు సీపీడబ్ల్యూఎస్ స్కీంలకు సింగిల్ టెండర్లు రాగా మిగిలిన వాటికి 5 నుంచి 9 మంది వరకు కాంట్రాక్టర్లు టెండర్లు వేశారు. కాగా.. రూ.50 లక్షలు పైబడిన టెండర్లను మంగళవారం సాయంత్రం 4 గంటల తరువాత ఓపెన్ చేశారు. ఇందులో మైదుకూరు, బి.మఠం, యోగివేమన యూనివర్శిటీ, ముద్దనూరు, మైలవరం, కొండాపురం, పులివెందుల, గాలివీడు సీపీడబ్ల్యూఎస్ స్కీంలు ఉన్నాయి. సీపీడబ్ల్యూఎస్ స్కీంల నిర్వహణ టెండర్లు ఆన్‌లైన్ ద్వారా కొనసాగించినప్పటికీ ఇప్పటి వరకు రాజకీయ నేతల నిర్ణయం ప్రకారమే ఖరారు చేస్తూ వచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. తాజా టెండర్ల వ్యవహారంలో కూడా ఈ సంప్రదాయాన్నే కొనసాగించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

పారదర్శకంగా టెండర్లు : జడ్పీ సీఈవో

ప్రభుత్వ నిబంధనల ప్రకారం సీపీడబ్ల్యుఎస్ స్కీంల టెండర్లను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు జడ్పీ సీఈవో సుధాకర్‌రెడ్డి తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలోని 21 సీపీడబ్ల్యుఎస్ స్కీంల నిర్వహణకు రూ.10.80 కోట్ల వ్యయంతో అన్‌లైన్ టెండర్లను పిలిచామన్నారు. టెండర్ల ఖరారులో ఎలాంటి రాజకీయ జోక్యం లేదన్నారు.

అనుకూల కాంట్రాక్టర్లకు అధికారుల వత్తాసు

జడ్పీ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలోని కొందరు అధికారులు సీపీడబ్ల్యూఎస్ స్కీంల కాంట్రాక్టర్లతో కలిసిపోయి పరస్పర సహకారంగా పనిచేస్తున్నారు. దీంతో 2024-25 స్కీంల నిర్వహణ టెండర్లలో తమ అనుకూలురకు తిరిగి ఆయా స్కీంలను కట్టబెట్టే ప్రయత్నాలు ముమ్మురంగా చేస్తున్నారు. ఫలానా రాజకీయ నాయకుడిని సంప్రదించి ఫలానా అధికారికి ఫోన్ చేయిస్తే వారు తమకు అప్పగిస్తారని, తరువాత పని చక్కదిద్దుతామని సదరు కాంట్రాక్టర్లకు చెబుతున్నారని అంటున్నారు.

రూ.10.80 కోట్లతో 21 స్కీంలకు టెండర్లు

ఉమ్మడి కడప జిల్లాలో 22 సీపీడబ్ల్యూఎస్ స్కీంలు నడుస్తున్నాయి. ఇందులో 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను ఆయా ప్రాంతాల ప్రజలకు వీటి ద్వారా తాగునీటిని సరఫరా చేసేందుకు రూ.10.80 కోట్లతో 21 స్కీంలకు అన్‌లైన్ టెండర్లను పిలిచారు.

సీపీడబ్ల్యూఎస్ స్కీంల నిర్వహణకు ప్రాంతాల వారీగా..

కడప డివిజన్‌లో	
కమలాపురం	రూ.42 లక్షలు
మైదుకూరు	రూ.105 లక్షలు
బి.మఠం	రూ.65 లక్షలు
వైవీయూ	రూ.63 లక్షలు
మాధవరం-1	రూ.41 లక్షలు
కె.మాధవరం-2	రూ.25 లక్షలు
పులివెందుల డివిజన్‌లో	
ముద్దనూరు	రూ.80.50 లక్షలు
మైలవరం	రూ.92 లక్షలు
కొండాపురం	రూ.69 లక్షలు
పులివెందుల ఆఫ్‌ల్యాండ్	రూ.48 లక్షలు
కె.యర్రగుడి	రూ.38.50
వేంపల్లి	రూ.43 లక్షలు
పులివెందుల	రూ.145 లక్షలు
రాజంపేట డివిజన్‌లో	
హెచ్.చెర్లోపల్లి	రూ.37 లక్షలు
ఆకేపాడు	రూ.4 లక్షలు
హత్యరాల	రూ.20 లక్షలు
పొందలూరు	రూ.42 లక్షలు
పెనగలూరు	రూ.19.30 లక్షలు
పుల్లంపేట	రూ.8 లక్షలు
రాయచోటి డివిజన్‌లో..	
గాలివీడు	రూ.53 లక్షలు
కె.బోయనపల్లి	రూ.20 లక్షలు

- మొత్తం 21 సీపీడబ్ల్యూఎస్ స్కీంల నిర్వహణకు గాను రూ.1080.80 లక్షలతో టెండర్లను పిలిచారు.

రైతు సమస్యలపై పోరాటాలు ఉధృతం

- రైతులకు పిలుపునిచ్చిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

మదనపల్లె అర్బన్, జూలై 30: రైతు సమస్యలపై పోరాటాలను ఉధృతం చేద్దామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ రైతులకు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఎన్వీఆర్ కల్యాణమండపంలో రెండోరోజు నిర్వహించిన రైతు సంఘం సదస్సుకు ముఖ్య అతిథిగా పాల్గొన్న రామకృష్ణ మాట్లాడుతూ రైతుల సమస్యలపై రైతు సంఘాలు పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ విధానాలను అరికట్టి దేశంలో రైతుల ఆత్మహత్యలను అరికట్టాలన్నారు. దేశంలో రాజకీయాలను కార్పొరేట్ శక్తులు శాసిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దేశంలో ఏ వర్గానికి లేని సమస్యలు రైతులు ఎదుర్కొంటున్నారని, ఈ సమస్యల పరిష్కారం కోసం గ్రామీణ ప్రాంతాల నుంచే రైతులను సమీకరించి పెద్ద ఎత్తున పోరాటాలు, ఆందోళనలు చేయాలని సూచించారు. జగన్ ప్రభుత్వం రాష్ట్రంలో అరాచక, దోపిడీ పాలన సాగించాడని, పరిపాలన మొత్తం గాలికి వదిలేశారని విమర్శించారు. వైసీపీ పాలనలో మంత్రులు, ఉపముఖ్యమంత్రులకు అపాయింట్‌మెంట్ ఇవ్వని వ్యక్తి జగన్ అన్నారు. దీని ఫలితమే రాష్ట్రంలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఓట్ల ద్వారా వైసీపీకి గుణపాఠం చెప్పారని గుర్తు చేశారు. ఏపీ రాష్ట్రానికి న్యాయం జరగాలంటే బడ్జెట్‌లో రూ.15 వేల కోట్లు అప్పుగా కాకుండా గ్రాంట్‌గా ఇచ్చి ఉండాల్సిందని అన్నారు. కార్యక్రమంలో అఖిల పక్ష భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య, ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ఈశ్వరయ్య, కేవీవీ ప్రసాద్, రైతు సంఘం నాయకులు కాటమయ్య, జమలయ్య, జగన్నాథం, రామానాయుడు, అప్పలనాయుడు, డేగా ప్రభాకర్, ఏపీ ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి పెంచలయ్య, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శివారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, సహాయ కార్యదర్శి మహేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు తోపు కృష్ణప్ప, సాంబశివ, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, సీపీఐ మదనపల్లె నియోజకవర్గ కార్యదర్శి మురళి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

పులివెందుల జగనన్న కాలనీలో భారీ అక్రమాలు

- 2,458 గృహాలు అనర్హులకు మంజూరు
- ప్రభుత్వ విచారణలో బయటపడ్డ అక్రమాలు



పులివెందుల జగనన్న లేఅవుట్

పులివెందుల, జూలై 30: పులివెందుల జగనన్న కాలనీలో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయని ప్రభుత్వం తేల్చి చెప్పింది. పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో 8,648 పక్కాగృహాలకు 2,458 గృహాలు అనర్హులకు మంజూరు చేసినట్లు ప్రభుత్వం తేల్చి చెప్పింది.

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొంత నియోజక వర్గమైన పులివెందులలో జగనన్న కాలనీ లేఅవుట్‌లో అనర్హులకు పెద్దఎత్తున ప్రాధాన్యత కల్పించారు. చోటా మోటా నాయకులు చెప్పిం దే వేదం, చేసిందే శాసనంలా ఈ పక్కాగృహాల మంజూరు సాగింది. పక్క జిల్లాల వారికి, ప్రభుత్వ ఉద్యోగులకు, ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించిన వారికి పక్కాగృహాలు మంజూరయ్యాయి. దీనిపై ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఫిర్యాదు చేశారు. దీనితో ప్రభుత్వం ఒక ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీ విచారణలో అనేక విషయాలు వెలుగు చూశాయి. పులివెందుల జగనన్న కాలనీలో 2,458 మందిని అనర్హు లుగా గుర్తించారు. వీరంతా బినామీలుగా తేలింది. నంద్యాల, చిత్తూరు, అనంతపురం తదితర జిల్లాల వారికి కూడా ఇక్కడ పక్కాగృహాలు మంజూరయ్యాయి. అలాగే ఆధార్‌కార్డు నెంబరు కూడా లేకుండా పక్కాగృహాలు మంజూరయ్యాయంటే ఏస్థాయిలో బినామీలు ఉన్నారో ఇట్టే అర్థమవుతోంది. 366 మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్న కుటుంబా లకు పక్కాగృహాలు మంజూరయ్యాయంటే పులివెందుల జగనన్న కాల నీలో ఏస్థాయిలో అక్రమాలు జరిగాయో చెప్పాల్సిన అవసరం లేదు.

విచారణలో తేలిన వాస్తవాలు

రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిటీ విచారణలో తేల్చిన వివరాలు చూస్తే.. పులివెందుల జగనన్న కాలనీలో మొత్తం 7075 ఇళ్లు మంజూరు చేశారు. ఇందులో 300 యూనిట్ల కంటే ఎక్కువ విద్యుత్ వినియోగించే వారి సంఖ్య 75. 1000చదరపు అడుగుల కంటే ఎక్కువ పట్టణ ఆస్తిని కలిగిన వారి సంఖ్య 248. ఇట్లో ఒక వ్యక్తి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించిన లబ్ధిదారులు 366 మంది. నాలుగు చక్రాల వాహనం ఉన్న వారి సంఖ్య 83. మూడు కంటే ఎక్కువ (తడి) ఎకరాల భూమి ఉన్నవారు ఒకరు, 10ఎకరాలు పైబడిఉన్నవారు 16 మంది ఉన్నారు. అలాగే ఒకే ఇంట్లో నివాసం ఉన్న 13 మందికి ఇళ్లు మంజూరయ్యాయి. ఎన్‌బీఎం పోర్టల్‌లో డేటా లేనివారి సంఖ్య 77, ఇతర మండలాలకు చెందిన వారు 307, ఇతర జిల్లాలకు చెందిన వారు 160 మంది ఉన్నారు. అలాగే.. ఆధార్‌లో పేర్లు సరిపోలని వారు 5 మంది, ఎక్కువ సైట్లు కేటాయించిన వారు ఒక్కరు ఉన్నారు, గతంలో ఇళ్లు పొంది మళ్లీ పొందిన వారు 19 మంది, పన్ను చెల్లింపుదారుల సంఖ్య 407. మొత్తం 1,675 మంది అనర్హులుగా గుర్తించారు. అంతేకాకుండా మున్సిపాలిటీలో సొంత ఇంటి స్థలం ఉన్న లబ్ధిదారుల సంఖ్య 1318గా ఉంది. 1000 చదరపు అడుగులకంటే ఎక్కువ పట్టణ ఆస్తిగలవారు 95 మంది, అంతకటే తక్కువ ఆస్తి గలవారు 379 మంది ఉన్నారు. 300యూనిట్ల కంటే ఎక్కువ విద్యుత్ వినియోగించే వారు 75 మంది, ప్రభుత్వ మరియు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు 74 మంది ఉన్నారు. అంతేకాకుండా ఇళ్ల స్థలాలు జారీ చేసిన ఇళ్లు మంజూరు కాని వారు 135 మంది ఉన్నారు. వీరిలో కూడా 65 మంది అనర్హులు ఉన్నారు. అలాగే రాజీవ్‌కాలనీ లబ్ధిదారులు ఇందులో 75 మంది ఉన్నారు. వీరిలో 17 మంది అనర్హులు ఉన్నారు. ఈ మేరకు ప్రభుత్వం నియమించిన కమిటీ విచారణలో గుర్తించారు. మొత్తం మీద పులివెందుల జగనన్న కాలనీలో దాదాపు 30 శాతం అవినీతి జరిగిందని తేల్చారు.

వనరులను ప్రభావవంతంగా వినియోగించుకోవాలి

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 30: వైవీయూలో ఉన్న వనరులను ప్రభావవం తంగా వినియోగించేలా ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది పనిచేయాలని ఇన్‌చార్జ్ వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసరు ఎస్.రఘునాథ రెడ్డితో కలిసి మంగళవారం ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. యూనివర్శిటీలో సురక్షిత నీరు, సోలార్ నుంచి లభించే విద్యుత్‌కు సంబంధించి అధికారులతో చర్చించారు. అలాగే నిర్మాణాలపై.. అందుకు తగ్గ వ్యయం, ఉన్న వనరులను గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అధ్యాపకులు, సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు. యూనివర్శిటీ అవస రాలపై ఇంజనీరింగ్ అధికారులు వీసీ దృష్టికి తెచ్చారు. రిజిస్ట్రార్ ప్రొఫెసరు రఘు నాథరెడ్డి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసరు జయరామిరెడ్డి, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడి.. భావితరాలకు ఆదర్శంగా నిలవాలి



మొక్కలు నాటుతున్న రాజేంద్ర చౌదరి, సలీంబాషా

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 30: మొక్కల పెంప కమే భవిష్యత్‌తరాలకు అం దించే గొప్ప బహుమతి అని.. పర్యావరణాన్ని కాపాడి భావి తరాలకు మేలు చేయడమే కాక వారికి ఆదర్శంగా నిలవా లని భారత ప్రభుత్వ సమా చార ప్రసార మంత్రిత్వ శాఖ అడిషనల్ డైరెక్టర్ జనరల్ రాజేంద్ర చౌదరి పిలుపు నిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ పిలుపు మేర కు సమాచార ప్రసార మంత్రిత్వశాఖ పరిధిలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ క్షేత్ర కార్యాలయం, కడప ఆధ్వర్యంలో ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాల లో అమ్మపేరిట ఒక మొక్క కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. విద్యార్థుల చేత పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.సలీంబాషా మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు మెరుగైన పర్యావరణంతో కూడిన భూమిని అందించడం మనందరి బాధ్యతగా గుర్తించాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి



చాపాడు, జూలై 30: మండలంలోని సీబీఐటీ కాలేజీ వద్ద ప్రొద్దుటూరు-మైదుకూరు జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ (50) మృతి చెందింది. పోలీసుల వివరాల మేరకు.. గుర్తు తెలియని మహిళ రోడ్డుపై నడుచుకుంటూ వెళుతుండగా ప్రొద్దుటూరు నుంచి మైదుకూరు వైపు వెళుతున్న పల్సర్ మోటారు సైకిల్ ఢీకొనడంతో ఆమె తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండడంతో చికిత్సకోసం ప్రొద్దుటూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి 108 వాహనంలో తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు తెలిపారు. ఆమె ఆరింజ రంగు పంజాబీ కుర్తా, బ్లూ రంగు రవిక ధరించి ఉంది. ఆమె ఆచూకీ తెలిసినవారు 9121100601కి తెలియజేయాలని కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

14 మామిడి చెట్లు నరికివేత

గాలివీడు, జూలై 30: మండలంలోని అరవీడు గ్రామంలోని శ్రీనగర్‌కాలనీకి చెందిన షేక్.షబ్బీర్‌అహమ్మద్‌కు చెందిన 14 మామిడి చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేసినట్లు బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. షబ్బీర్ అహమ్మద్ జీవనోపాధి కోసం గల్ఫ్‌దేశానికి వెళ్లాడు. కాగా, తన పొలంలో 140 మామిడి చెట్లను పెంచుకుంటున్నారు. సోమవారం వేకువజామున గుర్తు తెలియని వ్యక్తులు 14 చెట్లను నరికేశారని బాధితుడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

టి.కోడూరులో సంఘటనలో 29 మంది అరెస్టు

కొండాపురం, జూలై 30: మండలంలోని టి.కోడూరు గ్రామంలో సోమవారం జరిగిన సంఘటనకు సంబంధించి 29 మందిని అరెస్టు చేసినట్లు సీఐ వేణుగోపాల్, తాళ్ల ప్రొద్దుటూరు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఎంపీటీసీ రామమునిరెడ్డి నుంచి రివాల్వర్‌తో పాటు 29 బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే పవన్ కుమార్ రెడ్డి వర్గానికి చెందిన 19 మందిని, రామమునిరెడ్డి వర్గానికి చెందిన 10 మందిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు తెలిపారు.

పాము కాటుకు కౌలు రైతు మృతి

సిద్దవటం, జూలై 30: మండలంలోని శాఖ రాజుపల్లె గ్రామ పంచాయతీ బ్రాహ్మణ పల్లెకు చెందిన కౌలు రైతు వేటూరి పిచ్చయ్య (57) పాము కాటుకు గురై మృతి చెందాడు. గ్రామ సమీపంలో తాను సాగుచేస్తున్న అరటి పంటలో చెత్తను తొలగించేందుకు సోమవారం మధ్యాహ్నం వెళ్లాడు. పొలంలో చెత్తను తొలగిస్తుండగా పిచ్చయ్య చేతికి పాము కాటు వేయడంతో ఒంటిమిట్ట ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడినుంచి 108లో కడప రిమ్స్‌కు తరలించారు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పెద్దఓబన్న తెలియజేశారు.

విద్యుత్ చౌర్యంపై దాడులు

కడప (నాగరాజుపేట), జూలై 30: జిల్లాలోని కడప, సిద్దవటం మండలాల్లోని పలు ప్రాంతాల్లో కడప విజిలెన్స్ విభాగపు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేశ్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యుత్ చౌర్యంపై దాడులు నిర్వహించారు. అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న 40 మందిపై కేసులు నమోదు చేసి.. రెండు లక్షల రూపాయల మేర అపరాధ రుసుం విధించామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో షార్ ఉద్యోగి దుర్మరణం

మృతుడిది చిట్వేలి మండలం వెంకటరాజుపల్లె



సంఘటన స్థలంలో మలిశెట్టి నరేంద్ర మృతదేహం

సూళ్లూరుపేట, జూలై 30: సూళ్లూరుపేట సమీపంలోని పిండిపాలెం క్రాస్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో షార్ ఉద్యోగి మలిశెట్టి నరేంద్ర (37) మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు షార్‌లోని కంప్యూటర్ విభాగంలో సీనియర్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న నరేంద్ర మోటారు సైకిల్‌పై సూళ్లూరుపేట వైపు వస్తుండగా పిండిపాలెం క్రాస్ రోడ్డు వద్ద వున్న డాబాహోటల్ వద్ద ఆగివున్న లారీని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతుడి వివరాల కోసం గాలించగా జేబులో ఉన్న ఆధార్ కార్డు, లైసెన్సు ఆధారంగా అన్నమయ్య జిల్లా చిట్వేలి మండలం వెంకటరాజుపల్లికి చెందిన వ్యక్తిగా గుర్తించి అక్కడ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. నరేంద్ర షార్‌లో పనిచేస్తూ సూళ్లూరుపేట సమీపంలోని షార్ ఉద్యోగుల కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఉదయం ఇంటి నుంచి మోటారు సైకిల్‌పై డ్యూటీకి వెళ్లి మధ్నాహ్నం ఇంటికి వచ్చి తిరిగి డ్యూటీకి వెళ్లాడని, అయితే ప్రమాదం జరిగిన ప్రాంతానికి ఎందుకు వెళ్లాడనేది తమకు తెలియడం లేదని ఆయన భార్య, బంధువులు పోలీస్ స్టేషన్ వద్ద కన్నీరుమున్నీరయ్యారు. మధ్నాహ్నం డ్యూటీకని వెళ్లిన నరేంద్ర రాత్రి 9 గంటల వరకు ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చిందన్నారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయాన్ని సోషల్ మీడియాలో తెలుసుకొని అనుమానంతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చి మృతదేహాన్ని గుర్తించారు.

సీపీఎస్ ఉద్యోగుల పాక్షిక ఉపసంహరణపై నిషేధాన్ని ఎత్తివేయాలి



ఉప ఖజానా అధికారికి వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 30: సీపీఎస్ ఉద్యోగులు తమ కంట్రిబ్యూషన్ నుంచి అవసరాల కోసం పొందే ఉపసంహరణపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేశ్‌బాబు కోరారు. మంగళవారం జిల్లా ఉప ఖజానాశాఖ అధికారి వెంకటేశ్వర్లుకు ఆయన వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీపీఎస్ ఉద్యోగులు తమ జీతం నుంచి కంట్రి బ్యూషన్‌గా చెల్లించిన సొమ్ములో 25 శాతం వ్యక్తిగత, అనారోగ్య అవసరాల కోసం ఉపసంహరించుకోవడానికి అవకాశం ఉందని.. ఆ సొమ్ము పొందడానికి ప్రస్తుతం ఖజానాశాఖ నిషేధం విధించడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. చాలా మంది సీపీఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులు ఆర్థిక అవసరాల కోసం లోన్ ద్వారా తీసుకోవాలనుకున్న సొమ్ము విడుదల చేయకుండా నిషేధించడం మంచిది కాదని.. వెంటనే వార్షిక ఉపసంహరణపై ఉన్న నిషేధం ఎత్తివేయాలన్నారు. జిల్లా ఉపసంచాలకులు వెంకటేశ్వర్లు స్పందిస్తూ ఈ విషయాన్ని రాష్ట్రస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఎజాజ్ అహ్మద్, చంద్రశేఖర్, గోపినాథ్, సురేశ్‌బాబు పాల్గొన్నారు.

ప్రతి పంచాయతీ అభివృద్ధిపథంలో నడవాలి : డీపీవో

కమలాపురం రూరల్, జూలై 30: ప్రతి పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపించాల్సిన బాధ్యత మీదేనని జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కమలాపురం మండలానికి సంబంధించిన పంచాయతీ కార్య దర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో మండల అభివృద్ధి కార్యా లయంలో ఎంపీడీఓ జ్యోతి అధ్యక్షతన సమావేశం నిర్వహిం చారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకా లంలో గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం అధ్వాన్నంగా ఉం టుందన్నారు. డ్రైనేజీ వ్యవస్థ లేక వర్షపు నీరు రోడ్లపై నిల బడుతుందని.. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేప ట్టాలన్నారు. వర్షాకాలంలో వర్షపు నిల్వడం వల్ల దోమలు ప్రబలి రోగాలు వస్తాయని.. ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఎప్పటికప్పుడు బ్లీచింగ్ పౌడరు చల్లించాలని, రోడ్లపై నిలబడిన వర్షపు నీరు తొలగించాలని సూచించారు. అనంతరం ఓడీఎఫ్ మొబైల్ యాప్, ఇంటి పన్ను వసూలు తదితర వాటి గురించి క్షుణ్ణంగా తెలిపారు. ఈ ప్రగతి నివేదికల్లో వెనుకబడిన గ్రామ పంచాయతీల పంచాయతీ కార్యదర్శులను, ఇంజనీరింగ్ అసి స్టెంట్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో రమణా రెడ్డి, ఈవో శారదమ్మ, డీఆర్‌పీ రాఘవరెడ్డి పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందించాలి



ఉపాధ్యాయ, సిబ్బందితో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ నిదియాదేవి

సుండుపల్లె, జూలై 30: విద్యార్థినులకు నాణ్యమైన విద్యను అందించాలని రాజంపేట సబ్ కలెక్టర్ నిదియాదేవి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయ ఉపాధ్యాయులను ఆదేశించారు. మంగళవారం ఆకస్మికంగా పాఠశాలను తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా మధ్యాహ్నం విద్యార్థినుల కోసం చేసిన భోజనాన్ని పరిశీలించి నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు. అలాగే తరగతి గదులు, టాయిలెట్లు, పరిసరాలను పరిశీలించి విద్యార్థినులకు మంచి వాతావరణాన్ని కల్పిస్తున్నారని ప్రశంసించారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తే మంచి స్థాయికి రాణిస్తారని.. అది గురువులతోనే సాధ్యపడుతుందన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడుతూ క్రమం తప్పకుండా తరగతులు జరుగుతున్నాయా, మంచి భోజనాన్ని అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. చదువుకుంటేనే సమాజంలో గుర్తింపుతో పాటు ప్రత్యేక స్థానం లభిస్తుందన్నారు. స్పెషల్ ఆఫీసర్ శివశృతి, సిబ్బంది పాల్గొన్నారు.

దేవుని కడప హుండీ ఆదాయం రూ.7,88,429



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

కడప (కల్చరల్) జూలై 30: తిరుమల తొలిగడప దేవునికడప శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి హుండీ లెక్కింపు మంగళవారం నిర్వహించారు. జూన్ 27వ తేదీ నుంచి ఈనెల 30 వరకు (34 రోజులకు) స్వామివారి దర్శనానికి ఆలయానికి వచ్చే భక్తుల ద్వారా కానుకల రూపంలో హుండీలో సమర్పించిన ఆదాయం రూ.7,88,429 సమకూరినట్లు వెల్లడించారు. తిరుమల తిరుపతి దేవస్థానం, దేవుని కడప దేవస్థానం సూపరింటెండెంట్ హనుమంతయ్య, విజిలెన్స్ అధికారి చంద్రానాయక్, ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో దేవస్థానం సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

అన్యాక్రాంతమైన భూములపై చర్యలు

దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్

పుల్లంపేట, జూలై 30: జిల్లాలో అన్యాక్రాంతమైన భూములను గుర్తించి చర్యలు తీసుకుంటామని దేవదాయశాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ సి.విశ్వనాథ్ తెలిపారు. మంగళవారం రైల్వేకోడూరులోని భుజంగేశ్వరస్వామి ఆలయంలో నూతన ధ్వజస్తంభం ప్రతిష్ఠ కార్యక్రమానికి విచ్చేసిన ఆయన పుల్లంపేట శివాలయాన్ని సందర్శించారు.

ఈసందర్భంగా మాట్లాడుతూ పుల్లంపేటలోని సర్వే నెంబరు 33లో ఆంజనేయస్వామి ఆలయం మాన్యం 8ఎకరాలకు పైగా ఉందన్నారు. అనంతరాజు పేట సత్రం భూముల స్థితిగతులపై తహసీల్దారుతో చర్చించామన్నారు. భుజంగేశ్వరస్వామి ఆలయ భూముల్లో ఆక్రమణలను గుర్తించామని ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఈవో కొండారెడ్డి, తనిఖీ అధికారి శివయ్య, జూనియర్ అసిస్టెంట్ సుధీర్ కుమార్‌రెడ్డి, దేవస్థానం సభ్యులు పాల్గొన్నారు.

59 పరుగులతో కడప... 69 పరుగులతో విశాఖ జట్ల విజయకేతనం

- డ్రాగా ముగిసిన చిత్తూరు- క్రిష్ణా జట్ల మ్యాచ్




5 వికెట్లు సాధించిన నాగకుళాయప్ప (కడప), 158 పరుగులతో నాటౌట్‌గా నిలిచిన ప్రణీత్ పవన్ (వెస్ట్‌గోదావరి)

కడప (స్పోర్ట్స్), జూలై 30: కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-19 ఇంటర్ డిస్ట్రిక్ట్ మల్టీ డే క్రికెట్ మ్యాచ్‌లలో చివరి రోజైన కడప జట్టు 59 పరుగులతో విజయం సాధించగా, మరో మ్యాచ్‌లో విశాఖపట్నం జట్టు 69 పరుగులతో విజయకేతనం ఎగుర వేసింది. చిత్తూరు-క్రిష్ణా జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్ డ్రాగా ముగిసింది. వివరాలిలా....

కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో కడప-శ్రీకాకుళం జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లో శ్రీకాకుళం జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 63.3 ఓవర్లలో 204 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఇందుకు ప్రతిగా బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు తన 117.2 ఓవర్లలో 455 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో కడప జట్టుకు 251 పరుగుల ఆధిక్యత లభించింది. అనంతరం ఆటకు చివరి మూడవ రోజున శ్రీకాకుళం జట్టు తన రెండో ఇన్నింగ్స్‌లో 65.3 ఓవర్లలో 192 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో కడప జట్టు 59 పరుగుల ఆధిక్యతతో విజయం సాధించింది. విజయంలో నాగ కుళాయప్ప (బౌలర్) 5 వికెట్లు తీసి కీలకంగా నిలిచారు.

కేఓఆర్ఎం మైదానంలో విశాఖ-వెస్ట్ గోదావరి జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన విశాఖ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 53 ఓవర్లలో 171 పరుగులకు ఆలౌట్ అయ్యింది. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన వెస్ట్ గోదావరి జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 35.3 ఓవర్లలో 131 పరుగులకే చేతులెత్తేసింది. దీంతో విశాఖ జట్టుకు 40 పరుగుల ఆధిక్యత లభించింది. విశాఖ తన రెండో ఇన్నింగ్స్‌లో 67.4 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 366 పరుగుల భారీ స్కోర్ వద్ద డిక్లేర్ చేసి 406 పరుగుల ఆధిక్యత సాధించింది. ఆటకు చివరి రోజైన మంగళవారం వెస్ట్ గోదావరి జట్టు 86.2 ఓవర్లలో 337 పరుగులకే ఆలౌట్ కావడంతో 69 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ఇందులో ప్రణీత్‌పవన్(బ్యాటర్) 158 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. బౌలింగ్ విభాగంలో దేవాశిష్ 6 వికెట్లు పడగొట్టి జట్టు విజయానికి బాటలు వేశారు.

నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో సాగిన క్రిష్ణా-చిత్తూరు జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన క్రిష్ణా జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 97.2 ఓవర్లలో 396 పరు గులకు ఆలౌట్ అయ్యింది. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 117.3 ఓవర్లలో 391 పరుగులకు ఆలౌట్ అయ్యి దీటుగా సమాధానం చెప్పింది. దీంతో క్రిష్ణా జట్టుకు 5 పరు గుల స్వల్ప ఆధిక్యత లభించింది. ఇదిలా వుండగా.. మ్యాచ్‌కు చివరి రోజైన మంగళవారం తిరిగి రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన క్రిష్ణా జట్టు 53 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఆట ముగిసే సమయానికి 202 పరుగులు చేసింది. దీంతో క్రిష్ణా జట్టుకు మొదటి ఇన్నింగ్స్‌లో ఆధిక్యత సాధించినట్లయింది. ఎట్టకేలకు మ్యాచ్ డ్రాగా ముగిసింది.



వైభవంగా ఆడికృత్తిక వేడుకలు

రాజంపేట, జూలై 30 : ఆడి కృత్తిక సందర్భంగా మంగళవారం పట్టణంలోని పలు ఆలయాల్లో సుబ్రమణ్యస్వామి కళ్యాణ మహోత్స వాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారిశాల, ఈడిగపాలెంలోని వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి కళ్యాణోత్సవం నిర్వహించారు. పట్టణ నలు మూలల నుండి పెద్దఎత్తున మహిళలు హాజరయ్యారు. స్వయంగా స్వామివారికి పాలతో అభిషేకించారు. అనంతరం ఆలయ ధర్మకర్తలు కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న మహిళలకు పసుపు, కుంకుమలతో కూడిన గాజులు, సుబ్రమణ్యంస్వామి లాకెట్టు అందజేశారు. అనంతరం పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

చిట్వేలి: స్థానిక శ్యామలాంబ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామికి ఏకవార రుద్రాభిషేకం, సకల ద్రవ్య అభిషేకం, మహానైవేద్యం, మంగళహారతి నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ప్రదక్షిణ చేయించి దర్శన భాగ్యాన్ని కల్పించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు పవన్‌శర్మ, సురేంద్రశర్మ, అరవింద్‌శర్మ , ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నందలూరు: నాగిరెడ్డిపల్లె పంచాయతీ పరిధిలోని వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో సుబ్రమణ్యంస్వామికి అభిషేకం అలంకరణ చేశారు. ఆలయ పూజారి నరస రవికుమార్ శర్మ స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: స్థానిక భుంజగేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు యోగీశ్వర్‌శర్మ ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్య స్వామికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

సుండుపల్లె: మండల కేంద్రంలోని కార్తికేయ నగర్ ఆలయంలో మంగళవారం ఉదయం ఆడికృతిక సందర్భంగా సుబ్రమణ్యంస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానికులు ఉదయాన్నే స్వామి ఆరి ఆలయాన్ని చేరుకుని స్వామికి అభిషేకం, పూజలు నిర్వహించారు.

రాయచోటిటౌన్: పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవ స్థానంలో ఆడికృత్తిక సందర్భంగా మంగళవారం సుబ్రమణ్యంస్వామికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి, అర్చకులు శంకరయ్య, కృష్ణయ్యస్వామి పాల్గొన్నారు.





రాజంపేటలో వరసిద్ధి వినాయక, సుబ్రమణ్యంస్వాముల కళ్యాణ మహోత్సవం (పక్కన)
చిట్వేలి: స్వామివారికి ఆలయ ప్రదక్షిణ చేయిస్తున్న భక్తులు

మల్లికార్జున స్వామి భక్తులకు స్వామి విశిష్టతను వివరించారు.

రైల్వేకోడూరు: స్థానిక భుంజగేశ్వరస్వామి ఆలయంలో సుబ్రహ్మణేశ్వర స్వామికి ఆలయ అర్చకుడు యోగీశ్వర్‌శర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీగా భక్తులు పాల్గొన్నారు.

కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే శ్రీధర్

పుల్లంపేట: మండల పరిధిలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆడికృత్తిక సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వల్లీ, దేవసేనతో సుబ్రమణ్యం స్వామికి కళ్యాణం నిర్వహించి అన్నసంతర్పణ చేశారు. పుల్లంపేట శివాలయంలో సుబ్రమణ్యంస్వామి కళ్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. 2 వేల మందికి పైగా భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సంతర్పణ చేశారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు.

ఆలయాల మాన్యం భూముల్లో ఆక్రమణలు తొలగిస్తాం

సుండుపల్లె, జూలై 30: ఆక్రమణబారిన పడిన మాన్యం భూములు స్వాధీనం చేసుకుంటామని దేవాదాయశాఖ ఈవో రమణారెడ్డి, డివిజనల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. మండలంలోని ఆక్రమణలకు గురైన భూములను పరిశీలించారు. స్థానిక కార్తికేయ నగర్‌లోని సుమారు 44 సెంట్లు సుబ్రమణ్యంస్వామి భూమిని, వశిష్ట స్కూల్ సమీపంలో 8 సెంట్ల స్థలాన్ని పరిశీలించామన్నారు. ఆనంద్ నగర్, ఈదులవంక సమీపంలో ఓదేటమ్మ దేవస్థానానికి చెందిన 5 ఎకరాల 14 సెంట్లు ప్రభుత్వ భూమి ఆక్రమణలకు గురైనట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆ దేవుని మాన్యంలో రోడ్డు వేసే ప్రయత్నాలు జరగడంతో గతంలో స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సుండుపల్లె ఎస్‌ఐ హుస్సేన్ సహకారంతో రోడ్డు నిర్మాణాన్ని నిలిపివేశామన్నారు. త్వరలో అక్రమ నిర్మాణాలకు కంచె ఏర్పాటు చేస్తామని తెలియజేశారు. త్వరంలో భూముల వేలం నిర్వహిస్తామని తెలిపారు.

ఏపీయూడబ్ల్యూజే మహాసభలను జయప్రదం చేయండి

రాయచోటిటౌన్, జూలై30: ఏపీయూడబ్ల్యూజే అన్నమయ్య జిల్లా ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని యూనియన్ అన్నమయ్య జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు, కోకన్వీనర్లు వంశీ, లోకనాధ్‌లు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. రాయచోటి పట్టణంలోని ప్రీతం రెసిడెన్సీలో ఆగస్టు 1వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు జరిగే ఏపీయూడబ్ల్యూజే జిల్లా ప్రథమ మహాసభలకు జిల్లాలోని అన్ని పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలకు చెందిన పాత్రికేయులు అందరూ హాజరుకావాలని కోరారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా రాష్ట్ర రవాణా, యువజన, క్రీడలశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి పీ. రామసుబ్బారెడ్డి, వైఎస్‌ఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ నాగిరెడ్డి, విశిష్ట అతిథు లుగా కలెక్టర్ శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు హాజరవుతారన్నారు. మహాసభల సందర్భంగా ఉదయం జరిగే సమావేశం అనంతరం మధ్యాహ్నం జిల్లా కమిటీతో పాటు ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కమిటీలను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు హాజరుకావాలని వారు కోరారు.

కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి



మంత్రి లోకేశ్‌కు వివరిస్తున్న ఐటీడీపీ కోఆర్డినేటర్ మురళి

చిన్నమండెం, జూలై 30: మంగళవారం ఉదయం విజయవాడ ప్రజాదర్బారులో రాష్ట్ర మంత్రి వర్యులు నారా లోకేశ్‌ను కలిసి కార్యకర్తల సమస్యలను, కార్యకర్తలు పడుతున్న బాధల గురించి చిన్నమండెం మండలం పడమటికోనకు చెందిన ఐటీడీపీ కో ఆర్డినేటర్ మురళి కలిసి వివరించారు. దీంతో లోకేశ్ బాబు స్పందిస్తూ ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తానని, సహనం కోల్పోవద్దని చెప్పారన్నారు.

దుకాణం లో చోరీ

రైల్వేకోడూరు, జూలై 30: పట్టణంలోని భుజంగేశ్వరాలయం ముందున్న ఉంగరాల నాగేంద్రరావు జనరల్ స్టోర్‌లో మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. దుకాణంపై కప్పు ఇనుక రేకులను కత్తిరించి లోనికి ప్రవేశించిన దుండగులు దుకాణంలోని నిత్యావసర సరుకుల తోపాటు రూ. 40 వేలు చోరీ చేసినట్లు బాధితుడు నాగేంద్రరావు తెలిపారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన వివరించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



మెరుగైన వైద్యసేవలు అందించండి



వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్, సాయివికాస్ రెడ్డి

చిట్వేలి, జూలై 30 : వైద్యశాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని నియోజకవర్గ ఎమ్మెల్యే అరవ శ్రీధర్ వైద్యులకు సూచించారు. మంగళవారం కూటమి నేతలతో కలిసి చిట్వేలి ప్రభుత్వ వైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య సేవల్లో అశ్రద్ధ వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. గ్రామాల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి సత్వరం చర్యలు తీసుకోవాలని వైద్యులకు సూచించారు. అనంతరం నూతన హాస్పిటల్ భవనాన్ని పరిశీలించి, ఉన్నతాధికారులతో చర్చించారు. త్వరగా ప్రారంభించి సేవలు అందించాలని కోరారు. అనంతరం పోల్లోపల్లెలో విశ్రాంత ఆర్టీసీ డ్రైవర్ పట్టాబి రామరాజు పార్థివ దేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముక్కా సాయివికాస్‌రెడ్డి, కాకర్ల నాగార్జున గుత్తి నరసింహ, ఆకేపాటి వెంకటరెడ్డి, సత్యనారాయణ, మాదాసు నరసింహ, బొంతల నాగేశ్వరరావు, కొనిశెట్టి సుబ్బరాయుడు, బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, శివరాజు, కంచర్ల సుధీర్‌రెడ్డి, మన్మథ, సుధీర్‌రెడ్డి, వైద్యులు, సిబ్బంది, కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు పరిష్కరిస్తాం

ఓబులవారిపల్లె: మండలంలోని చిన్నఓరంపాడు గ్రామ పంచాయతీలోని అయ్యలరాజుపల్లెలో ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ముక్కా సాయివికాస్‌రెడ్డి. కొత్త బోరు, కొత్త పంపు ఏర్పాటు చేశారు. ముందుగా సర్పంచ్ కుమారుడు గద్దె పెంచలయ్య పూజలు చేసి మోటారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సిద్దమ్మ, కుమారుడు పెంచలయ్య, టీడీపీ యువత పయ్యావుల కోటేశ్వరనాయుడు, సుబ్బారెడ్డి, శివానందరెడ్డి, సురేంద్రరెడ్డి, రాజారెడ్డి, శివారెడ్డి, నరసింహారెడ్డి, బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, తేజ, అరవ నాని తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

వీరబల్లి, జూలై 30: మెనూ ప్రకారం విద్యార్థినులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని డీఈవో శివప్రకాశ్‌రెడ్డి కోరారు. వీరబల్లి కేజీబీవీని ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థినుల భోజనాన్ని రుచి చూశారు. అనంతరం సిబ్బందితో సమావేశమయ్యారు. విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగారు. మెనూ పాటిస్తున్నారా లేదా అని అడిగారు. అనంతరం సిబ్బందితో సమావేశమయ్యారు. ఎటువంటి సమస్యలున్నా తన దృష్టికి తేవాలన్నారు. ఒకరినొకరు పంతాలకు పోయి సమస్యలు తెచ్చుకోకుండా విద్య పట్ల దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో కృష్ణయ్య పాల్గొన్నారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండండి....

రైల్వేకోడూరు(రూరల్) జూలై 30: డయేరియా వ్యాప్తిపై ఆరోగ్యశాఖ అధికారులు ఆప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ ఉషశ్రీ తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో వై.కోట, ముక్కావారిపల్లె, ఓబులవారిపల్లె, సెట్టిగుంట, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బంది సమావేశంలో ఆమె మాట్లాడారు. వర్షాకాలం కాబట్టి అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ నారాయణ, డాక్టర్ దేవేంద్ర, రాజశేఖర్, అయేషా, సందీప్, దీప, మరియు సిబ్బంది బాలకృష్ణ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాలు కల్పించండి

రైల్వేకోడూరు(రూరల్) జూలై 30: రాష్ట్రంలోని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సీపీఐ మండల కార్యదర్శి ఏఐవైఎఫ్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దార్ల రాజశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ మండల ఏఐవైఎఫ్ నూతన అధ్యక్షుడుగా బత్తల నవీన్, ఉపాధ్యక్షుడుగా అంబటి జీవన్, సహాయ కార్యదర్శిగా మోడి చందు, 12 మంది సభ్యులతో నూతన కార్యవర్గం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు పండుగోల మణి, సహాయ కార్యదర్శి మొగులు వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల నుంచి కొత్తచెరువును కాపాడాలి

వీరబల్లి, జూలై 30: మండలంలోని వీరబల్లి పంచాయతీ కొత్తచెరువును ఆక్రమణలబారి నుంచి కాపాడాలని మండల టీడీపీ ఉపాధ్యక్షుడు దుర్గం అంజనేయులు, టీడీపీ నాయకులు తుమ్మల రమేశ్, సుధాకర్‌లు మంగళవారం డీటీ నారాయణస్వామికి ఫిర్యాదు చేశారు. యథేచ్ఛగా మొరవ ఆక్రమించడంతో పాటు, సాగు భూమిగా మార్చుకుని గట్టు వేశారన్నారు. కొందరు ఏకంగా స్థంభాలు నాటారన్నారు. ఆక్రమణలపై చర్యలు తీసుకుని చెరువు స్థలానికి హద్దులు ఏర్పాటు చేయాలని వారు కోరారు. చర్యలు తీసుకోకపోతే కలెక్టర్ దృష్టికి తీసుకువెళతామని వారు హెచ్చరించారు.

సీఎంతో సీఆర్సీ తనయుడి భేటీ

రాజంపేట, జూలై 30 : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో విజయవాడలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య తనయుడు విష్ణుస్వరూప్ మంగళవారం భేటీ అయ్యారు. తన తండ్రికి అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. తెలుగు దేశంపార్టీకి అంకితభావంతో పనిచేస్తామని వివరించారు. భవిష్యత్తులో అన్నివిధాల సముచిత స్థానం కల్పిస్తామని పార్టీ అభివృద్ధికి, చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని విష్ణుస్వరూప్‌కు చంద్రబాబునాయుడు సూచించారు.

మహిళల అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలి

గాలివీడు, జూలై 30: మహిళల అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ వెంకటప్రసాద్ హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు దురేశ్వరరాజు సారథ్యంలో రీడ్స్ సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ మానవ అక్రమ రవాణా దినం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహిళలు, బాలికల అక్రమ రవాణాకు ఆర్థిక సమానతలే ముఖ్య కారణం అన్నారు. శ్రమదోపిడీ, లైంగిక దాడులు, గృహ బానిసత్వం, పేదరికంతో ఇబ్బందులు పడుతున్న మహిళలు, బాలికలను లక్ష్యంగా చేసుకుని ఈ అక్రమ రవాణా సాగుతోందన్నారు. ఇంకా పిల్లలను లక్ష్యంగా చేసుకుని భిక్షాటన, అవయవాలు దొంగలించడం వంటి చర్యలు కూడా పరిపాటిగా మారిపోయాయ్యన్నారు. ఈ చర్యలపై మహిళలు, బాలికలు, చిన్నపిల్లలు అవగాహన కలిగి ఉండి అప్రమత్తంగా ఉండాలన్నారు. మండల విద్యాధికారి పిల్లి నాగరాజు, సర్పంచ్ లక్ష్మీదేవమ్మ, రీడ్స్ సంస్థ అధ్యక్షులు శ్రీనివాసులు, సీడీపీవో పద్మావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైల్వే సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

నందలూరు, జూలై 30 : నందలూరు రైల్వేకేంద్రంలోని తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కన్సల్టేటివ్ కమిటీ సభ్యులు కోరారు. మంగళవారం రైల్వేస్టేషన్‌లో స్టేషన్ మేనేజర్ కమలాకర్, రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో స్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ మీటింగ్ నిర్వహించారు. నందలూరు రైల్వే స్టేషన్‌లో రైళ్ల నిలుపుదల, నీరు నింపడం, రైల్వే పంక్షన్ హాలు ఆధునీకరణ, రైల్వే అండర్ పాస్ పనుల పూర్తి, ప్రయాణికులకు వెయిటింగ్ రూములు లాంటివి తప్పనిసరిగా కావాలని డిమాండ్ చేశారు. డాక్టర్ అరిగె రాంప్రసాద్, సమ్మెట శివ ప్రసాద్, ముంగి సుబ్బరాయుడు, మురళీ, రైల్వే ఆర్పీఎఫ్ ఏఎస్‌ఐ రవిబాబు హాజరయ్యారు.

అటవీ చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ

సిద్దవటం, జూలై 30 : సిద్దవటం అటవీ చెక్‌పోస్టు వద్ద మంగళవారం సాయంత్రం ఏడు గంటల నుంచి ఫారెస్ట్ రేంజి అధికారి కళావతి ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేశారు. అటవీ సంపద అక్రమంగా తరలిపోకుండా, వన్యప్రాణుల వేట అరికట్టడానికి ఈ చర్యలు తీసుకున్నామన్నారు. స్ట్రైకింగ్ ఫోర్స్, పీడబ్ల్యూఎస్ బేస్‌క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

రామాపురం, జూలై 30: మండలంలోని సరస్వతిపల్లె, కుమ్మరపల్లె పంచాయతీల్లో సర్పంచులు మునీర్‌బాషా, ముక్కోటి భారతి, పంచాయతీ సెక్రటరీ సూరం సంజీవరెడ్డి, సాయిదీపక్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం చెత్తాచెదారం, కంపచెట్లు తొలగించి బ్లీచింగ్, సున్నం చల్లించారు. కుమ్మరపల్లిలో తాగునీటి ట్యాంకును శుభ్రం చేయించారు.

వీరబల్లి: మట్లి గ్రామంలోలోని చెత్త సేకరణ కేంద్రాన్ని మంగళవారం సర్పంచ్ నాగార్జునాచారి, ఇన్‌చార్జి ఎంపీడీవో రామచంద్రారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మట్లి గ్రామం విజువల్ క్లినిక్‌గా ఎంపికైందన్నారు. దాంతో గ్రామాల్లో పారిశుద్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. చెత్త సేకరణ కేంద్రానికి మరమ్మతులు చేయిస్తు న్నామన్నారు. పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్ పాల్గొన్నారు.

ధ్వజస్తంభం ఏర్పాటుకు చర్యలు

రైల్వేకోడూరు, జూలై 30: స్థానిక భుజంగేశ్వరస్వామి ఆలయంలోని ధ్వజస్తంభాన్ని మంగళవారం దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్ పరిశీలించారు. ఆలయంలో ధ్వజస్తంభం ఏర్పాటుపై చర్చించారు. ఆలయంలో రికార్డులు, భూముల వివరాలు పరిశీలించారు.



పేద ప్రజలకు జగన్ చేసింది శూన్యం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గాజుల ఖాదర్‌బాషా

రాయచోటి టౌన్, జూలై 30: వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు జగన్‌రెడ్డి 77 లక్షల సరిహద్దు రాళ్లపై పబ్లిసిటీతో సరిపెట్టుకున్నారే తప్ప పేద ప్రజలకు చేసింది శూన్యమని, ప్రజలు ఛీ కొడుతున్నా జగన్‌రెడ్డికి ఇంకా అహంకారం తగ్గలేదని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కుప్పం నియోజకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా అన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రీసర్వే పేరుతో 77 లక్షల సరి హద్దు రాళ్లపై జగన్‌రెడ్డి తన బొమ్మలను చెక్కించుకున్నాడని, దాని కోసం రూ.700 కోట్లు ఖర్చు చేశాడని తీవ్రంగా దుయ్యబట్టారు. ప్రజా ముఖ్యమంత్రి అని చెప్పుకుంటున్న మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ప్రజల సొమ్మును ఇలా దుర్వినియోగం చేయడం నేరం కాదా అని ప్రశ్నించారు. వైసీపీ నాయకుల భూకబ్జాలపై అధికారులు విచారణ చేయాలని కోరారు.. జగన్‌రెడ్డి కట్టించిన పిచ్చుక గూళ్ల వంటి సెంటు, సెంటున్నర ఇళ్లల్లో విధిలేని పరిస్థితుల్లో పేద ప్రజలు నివాసం ఉంటున్నారన్నారు. ఇప్పుడు చంద్రబాబునాయుడు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల స్థలం ఇవ్వనున్నారన్నారు. 2014లో పూర్తయిన ఇళ్లకు కూడా జగన్‌రెడ్డి డబ్బులు ఇవ్వకుండా ఆపారని చెప్పారు. వాటన్నింటికీ చెల్లింపులు చేయాలని చంద్రబాబునాయుడు ఆదేశాలు ఇచ్చారన్నారు. కొత్త లబ్ధిదారులకు ఇళ్లు కట్టుకునేందుకు రూ.4 లక్షలు ఇస్తారన్నారు. చంద్రబాబునాయుడు ఏ నిర్ణయం తీసుకున్నా రాష్ట్రం, భావితరాలను ఆలోచించి నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. పగ, ప్రతీకారం మన సంస్కృతి కాదని, పార్టీలో ఉంటూ ద్రోహం చేసే వారికి కచ్చితంగా శిక్ష ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు వెంకట్రామిరెడ్డి, జయరామిరెడ్డి, అంజద్‌అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పాత బిల్లులను ఇప్పించండి



మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న శివప్పనాయుడు

గాలివీడు, జూలై 30: 2014 - 19 మధ్య కాలంలో చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని మండల టీ డీపీ ఉపాధ్యక్షుడు శివప్ప నాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం విజయవాడలోని తెలుగు దేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రికి బిల్లులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. తెలుగుదేశం ప్రభుత్వంలో చేసిన పనులకు వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా టీడీపీ నాయకులను, కార్యకర్తలను ఇబ్బంది పెట్టిందని తెలిపారు. కొన్ని పనులకు బిల్లులు మంజూరై అకౌంట్‌లో పడినప్పటికీ వాటిని విత్‌డ్రా చేసుకోకుండా అకౌంట్లను బ్లాక్ చేయించారని తెలిపారు. తన ఖాతాలోని రూ.20 లక్షల వరకు నగదు ఉన్నా, విత్‌డ్రా చేసుకోలేకపోతున్నానని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇలా మండలంలోని అన్ని బ్యాంకుల్లో టీడీపీ నాయకుల అకౌంట్లను బ్లాక్ చేయించారని తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నమయ్య జిల్లా ఉపాధి పీడీతో మాట్లాడి బ్లాక్ చేసిన అకౌంట్లను, అందులో ఉన్న నిల్వ డబ్బులకు సంబంధించిన వివరాలను 1వ తేదీలోపల తనకు అందజేయాలని సూచించారని ఆయన తెలిపారు.

పేదలను అప్పుల ఊబిలోకి నెట్టారు: చమర్తి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట టౌన్, జూలై 30 : ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పి వైసీపీ ప్రభుత్వం పేదలను అప్పుల ఊబిలోకి నెట్టిందని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్ మోహన్‌రాజు విమర్శించారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదల సొంతింటి కల తీర్చడంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అధికారులతో ఒత్తిడి చేయించడంతో లబ్దిదారులు అప్పుల బారిన పడ్డారన్నారు. ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో పేదల ఇళ్ల నిర్మాణం కోసం 4 లక్షల రూపాయలను అందజేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించడం హర్షణీయమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా పేదవారి ఇంటి నిర్మాణానికి సహకారం అందించాలన్నదే లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. గత ప్రభుత్వంలో జగనన్న కాలనీల పేరుతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు దందా నిర్వహించారన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ఈ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు సుబ్రమణ్యంనాయుడు, దగ్గుపాటి మణి, చల్లమయ్యయాదవ్, కోటయ్య నాయుడు, ఆనంద్, పరుశురాం, సతీష్‌కుమార్‌రాజు, శ్రీను, సూర్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక పెన్షనర్లు 1న ఇళ్ల దగ్గరే ఉండాలి

చిన్నమండెం జూలై30: ఎన్టీఆర్ భరోసా పింఛన్‌దారులందరూ 1వ తేదీ ఇంటి దగ్గరే ఉండాలని ఎంపీడీవో రామకృష్ణ సూచించారు. గ్రామ సచివాలయ ఉద్యోగులతో 1వ తేదీ గురువారం ఉదయం 6 గంటల నుంచి పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. కావున ఎవరూ ఎలాంటి పుకార్లు నమ్మవద్దని ఆయన సూచించారు.

లక్కిరెడ్డిపల్లె: పెన్షన్‌దారులకు ఆగస్టు 1న ఇంటి వద్దనే పెన్షన్ అందజేస్తామని ఏఓ గురుప్రసాదు తెలిపారు. గురువారం ఉదమం 6 గంటల నుంచి పెన్షన్లు పంపిణీ చేస్తామన్నారు.

ఓబులవారిపల్లె: ఆగస్టు 1వ తారీఖునే పెన్షనర్లకు పంపిణీ చేయాలని సచివాలయ సిబ్బందికి సూచనలు ఇచ్చినట్లు ఎంపీడీవో కుళ్లాయిస్వామి తెలిపారు. మండలంలో 6,461 మంది పింఛనర్లుండగా 2,72,13,500 రూపాయలను ఆగస్టు 1 ఉదయం ఐదు గంటలకు పంపిణీకి. ఉదయం ఐదు గంటలకే ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. ఇబ్బందిగా ఉన్నవారికి రెండో తారీఖున ఇచ్చేలా చూడాలన్నారు.

తాగునీటి బోరు ప్రారంభం



బోరును ప్రారంభిస్తున్న మండిపల్లె లక్ష్మీప్రసాదురెడ్డి

లక్కిరెడ్డిపల్లె జూలై 30: గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకుంటామని మంత్రి సోదరుడు డాక్టర్ లక్ష్మీప్రసాద్ రెడ్డి తెలిపారు. పందిళ్లపల్లె పంచాయతీలోని నల్లగుండ్లపల్లెలో మంగళవారం ఆయన బోరును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల ప్రాంతాలలోని సమస్యలు గుర్తించి తక్షణమే పరిష్కరిస్తామన్నారు. ఎగువ వడ్డెపల్లె నుంచి వాయిల్ రాజుగారిపల్లె, జే వడ్డెపల్లెగ్రామాలకు రోడ్లు ఏర్పాటు చేస్తామన్నారు. సమస్యలు తమ దృస్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు మదన్ మోహన్, నాయకులు చెన్నకృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, పందిళ్లపల్లె టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

గాలివీడు, జూల్జై 30: బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని సీడీపీవో వై. పద్మావతి సూచించారు. మంగళవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో బేటీ బచావో బేటీ పడావో, మిషన్ శక్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు కష్టపడి చదివి, మంచి భవిష్యత్తుకు ఇక్కడ నుంచే పునాదిరాయి వేసుకోవాలని తెలియజేశారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. బాలికలకు రక్షణ పరంగా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతను ఇస్తున్నదని, మీ హక్కులను, చట్టాలను అవగాహన చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సూపర్‌వైజర్ సోనీ పాల్గొన్నారు.

ప్రత్యేక తరగతుల పేరుతో వేధించడం తగదు

రాజంపేట, జూలై 30 : ప్రత్యేక తరగత్పు పేరుతో విద్యార్థులకు వేధించడం తగదని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నేతి నాగేశ్వర హితవుపలికారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తరగతుల పేరుతో ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యార్థులను ఉదయం 6 గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు క్లాస్ రూముల్లోనే బంధిస్తున్నారన్నారు. కనీసం ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు అలాంటి పాఠశాలలపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు నాని, ప్రసాద్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

చర్మ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి

లక్కిరెడ్డిపల్లె, జూలై 30: చర్మవ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని కోనంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సిద్దయ్య తెలిపారు. మంగళవారం స్థానిక మోడల్ స్కూల్ విద్యార్థులకు చర్మవ్యాధుల నిర్ధారణ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సిద్దయ్య మాట్లాడుతూ చర్మంపై తెల్లటి పొడలు ఉంటే ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కుష్టువ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు ఎంసీహెచ్ పీ కుమారి, ఏఎన్ ఎం ఉమామహేశ్వరి, ఆశావర్కరు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఐదేళ్లలో 3746 మంది అదృశ్యం

- పాత, ఇతర ప్రాంత కేసులు కలిపి 3848మంది ఆచూకీ లభ్యం
- బాలికలు, యువతులు, మహిళల అదృశ్యంపై లోక్‌సభలో హోం శాఖ సహాయ మంత్రి వెల్లడి

తిరుపతి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బాలికలు, యువతులు పెద్ద సంఖ్యలో అదృశ్యమవుతున్నారంటూ ఇదివరకూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన ఆరోపణలు ప్రకంపనలు సృష్టించిన సంగతి తెలిసిందే. రాష్ట్రం పరువు ప్రతిష్టలు దెబ్బ తీసేందుకు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారంటూ అప్పట్లో వైసీపీ వర్గాలు ఆయనపై విరుచుకుపడ్డాయి. అయితే తాజాగా మంగళవారం సాక్షాత్తూ లోక్‌సభలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి వెల్లడించిన వివరాలు గత వైసీపీ పాలకులకు చెంపపెట్టుగా పరిణమించింది. ఏపీ మొత్తం సంగతి పక్కన పెట్టి ఒక్క తిరుపతి జిల్లా వరకే చూస్తే గడచిన ఐదేళ్లలో ఏకంగా 3746 మంది బాలికలు, యువతులు, మహిళలు అదృశ్యమయ్యారు.అదే సమయంలో ఈ ఐదేళ్ల వ్యవధిలో పోలీసు యంత్రాంగం 3848 మంది ఆచూకీని కనుక్కోగలిగింది. 2019కి ముందు అదృశ్యమైన వారి, అలాగే ఇతర ప్రాంతాల్లో అదృశ్యమైన వారి ఆచూకీ జిల్లాలో లభించడం వల్ల అదృశ్యమైన వారి సంఖ్య కంటే ఆచూకీ దొరికిన వారి సంఖ్య స్వల్పంగా ఎక్కువగా కనిపిస్తోంది.

2019లో 579 మంది అదృశ్యం

ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో 2019లో 18 ఏళ్లలోపు బాలికలు 219మంది అదృశ్యమయ్యారు. అదే ఏడాది 240మంది ఆచూకీని పోలీసులు కనుగొన్నారు. 18 ఏళ్ళు ఆపై వయసున్న యువతులు, మహిళలు 360 మంది అదృశ్యం కాగా 347మంది ఆచూకీ తెలిసింది.ఈ రెండు కేటగిరీల్లో ఆ ఏడాది 579మంది అదృశ్యమైనట్టు ఫిర్యాదులు అందగా 587మంది ఆచూకీని పోలీసులు కనుగొన్నారు.

2020లో 931మంది గల్లంతు

2020లో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 18ఏళ్ల లోపు బాలికలు 349మంది అదృశ్యమైతే ఆ ఏడాదిలో 347మంది ఆచూకీ తెలిసింది. 18ఏళ్ల యువతులు, అంతకు పైబడిన వయసు కలిగిన మహిళలు 582మంది ఆచూకీ గల్లంతు కాగా 605మంది ఆచూకీని కనుగొన్నారు. ఆ ఏడాది బాలికలు, యువతులు, మహిళలూ కలిపి 931మంది అదృశ్యమైనట్టు పోలీసులకు ఫిర్యాదులందితే 952మందిని ట్రేస్ చేయగలిగారు.

2021లో 1085మంది మాయం

2021లో ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో 412మంది బాలికలు కనిపించకుండా పోగా ఆ ఏడాదిలో 428మంది బాలికల ఆచూకీని కనిపెట్టగలిగారు. అలాగే 673మంది యువతులు, మహిళలు గల్లంతు కాగా 717మంది ఆచూకీ వెల్లడైంది. ఆ ఏడాది మొత్తంగా 1085మంది బాలికలు, యువతులు, మహిళలు కనిపించకుండా పోగా 1145మంది ఆచూకీ తెలిసింది.

2022లో కనిపించకుండా పోయిన 615మంది

2022లో కొత్త జిల్లాల ప్రాతిపదికన తిరుపతి జిల్లాలో 217మంది బాలికలు గల్లంతు కాగా 211మంది ఆచూకీ కనిపెట్టారు.398మంది యువతులు,మహిళలు కనిపించకుండా పోగా 425మంది ఆచూకీ తెలిసింది. ఆ ఏడాది మొత్తంగా 615మంది అదృశ్యమైతే 636మంది ఆచూకీని కనిపెట్టారు.

2023లో 536మంది మిస్సింగ్

2023లో 192మంది బాలికలు అదృశ్యం కాగా 194మంది ఆచూకీ తెలిసింది. 344మంది యువతులు, మహిళలు గల్లంతు కాగా 324మంది ట్రేస్ అయ్యారు. మొత్తం 536మంది కనిపించకుండా పోగా 518 మందిని కనిపెట్టారు.

ఐదేళ్లలో 3746మంది అదృశ్యంపై ఫిర్యాదులు

గడచిన ఐదేళ్లలో జిల్లానుంచీ 3746మంది కనిపించకుండా పోయారని పోలీసులకు ఫిర్యాదులు అందాయి. ఇందులో కేటగిరీ వారీగా చూస్తే 1389మంది బాలికలు గల్లంతు కాగా అదే కేటగిరీలో 1420మంది ఆచూకీ తెలిసింది. అలాగే 2357మంది యువతులు, మహిళలు ఆచూకీ తెలియలేదని ఫిర్యాదులందగా ఆ ఏడాదిలోనే 2418మంది ఆచూకీ తెలిసింది. మొత్తంగా ఐదేళ్లలో ఈ రెండు కేటగిరీలూ కలిపి 3746మంది అదృశ్యం కాగా 3848మంది ఆచూకీ తెలిసింది. మంగళవారం లోక్‌సభలో టీడీపీ ఎంపీలు లావు శ్రీకృష్ణ దేవరాయలు, బీకే పార్థసారధి దీనిపై లిఖితపూర్వక ప్రశ్నలు వేయగా కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పై వివరాలు వెల్లడించారు.

ఈవీఎం గోదాము తనిఖీ


తనిఖీ అనంతరం రిజిస్టర్లో సంతకం చేస్తున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, జూలై 30: ఈవీఎం, వీవీప్యాట్లకు పటిష్ఠ భద్రత ఏర్పాటు చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఈవీఎం, వీవీ ప్యాట్ గోదామును మంగళవారం కలెక్టర్, డీఆర్వో పుల్లయ్యతో కలసి పరిశీలించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలా, ప్రతి మూడునెలలకోసారి ఈవీఎం, వీవీప్యాట్ గోదాములు తనిఖీ చేసి, సమగ్ర నివేదికను ఈసీఐకి పంపిస్తున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు అట్లూరి శ్రీనివాసులు, గంగరాజు, ఉదయ్, భాస్కర్, ఎన్నికల విభాగ అధికారి ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో తేలికపాటి వర్షాలు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 30: జిల్లాలోని 17 మండలాల్లో గడచిన 24 గంటల్లో మాదిరి నుంచి తేలికపాటి వర్షాలు కురిశాయి. మండలాలవారీగా నగరిలో 35.2, వెదురుకుప్పంలో 24.2, నింద్రలో 19.4, కార్వేటినగరంలో 16.8, విజయపురంలో 12.6. రొంపిచెర్లలో 7.8, సదుంలో 5.2, గంగాధరనెల్లూరులో 5.2, పులిచెర్లలో 5.0 తవణంపల్లెలో 4.8, ఐరాలలో 3.2, చిత్తూరు రూరల్‌లో 3.2, శ్రీరంగరాజపురంలో 2.8, గుడుపల్లిలో 2.6, పూతలపట్టులో 2.2, చిత్తూరులో 1.0, పెనుమూరులో 0.4 మిమీ వర్షపాతం నమోదయ్యింది.

వేము కళాశాలలో నూతన కోర్సులు


ప్రిన్సిపాల్ నవీన్

చంద్రగిరి, జూలై 30 : పూతలపట్టు మండలం, పి.కొత్తకోట సమీపంలోని వేము ఇంజనీరింగ్ కళాశాలలో బీబీఏ, బీసీఏ కోర్సుల్లో నూతన కోర్సులు ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ నవీన్ కిలారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీబీఏలో బిజినెస్ అనలిటిక్, బీసీఏలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్ కోర్సులను ఈ విద్యా సంవత్సరం నుంచే అటానమస్ ప్రోగ్రామ్‌గా నిర్వహించడం చిత్తూరు జిల్లాలో ప్రప్రథమం అని తెలిపారు. ఈ కోర్సులను పూర్తిగా ఉద్యోగ శిక్షణకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దామన్నారు. అంతేకాకుండా ఈ కోర్సులకు స్టూడెంట్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్ విత్ ఐఐబీఎస్, బెంగళూరు అన్నారు.ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు ఉద్యోగ సముపార్జనకు కావాల్సిన పూర్తి మెలకువలను నేర్పడానికి, ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. దీంతో పాటు విద్యార్థులకు పరీక్ష ఫలితాలను 15 రోజుల్లోనే ప్రకటిస్తామని తెలిపారు.

ఫ్యాన్లు చోరీ చేసిన ముఠా అరెస్టు



శ్రీరంగరాజపురం, జూలై 30: ఆరిమాకుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఫ్యాన్లను చోరీ చేసిన ముఠా సభ్యులను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు నాడు-నేడు కింద వచ్చిన 24 ఫ్యాన్లు రెండు గ్యాస్ సిలిండర్లను స్కూల్‌లో భద్రపరిచారు. గత నెల 5న వీటిని చోరీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బసివిరెడిపల్లె, చేకూరుఇండులకు చెందిన మురళి, గోపి, గంగాధరనెల్లూరు మండలం నందునూరు చెందిన జ్యోతి, తిరుపతి చెందిన నాగారాజు స్నేహితులు. వీరు మద్యం తాగుతుంటారు. ఈ నేపథ్యంలో వీరు స్కూల్ తలుపును పగలగొట్టి ఫ్యాన్లు, సిల్లిండర్లను చోరీ చేశారు. ఎస్ఐ కుళాయిప్ప సిబ్బందితో సోమవారం మెదవాడ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా, ఆటోలో ఫ్యాన్లు, సిలిండర్లు తరలిస్తుండగా గుర్తించారు. బిల్లు లేకపోవడంతో పట్టుకొని విచారించారు. తాము స్కూలులో చోరీ చేసినట్లు అంగీకరించారు. 21 ఫ్యాన్లను , రెండు సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్ తరలించామని ఎస్ఐ తెలిపారు. రికవరీ చేసిన ఫ్యాన్‌లను పాఠశాలకు అప్పగించారు.

జిల్లా జట్టుకు రోల్‌బాల్ ఛాంపియన్‌షిప్


బంగారు పతకాన్ని కైవసం చేసుకున్న బాలురు జట్టు

చిత్తూరు క్రీడలు, జూలై30: రాష్ట్రస్థాయి రోల్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా జట్టు బంగారు పతకాన్ని సాధించింది. ఈ నెల 27, 28వ తేదిల్లో విశాఖలో పోటీలు నిర్వహించారు. జిల్లా క్రీడాకారులు అండర్-11 బాలురు విభాగంలో బంగారు పతకం, అండర్-11 బాలికల విభాగంలో వెండి, అండర్-17 బాలురు విభాగంలో కాంస్య పతకాలు సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను పలువురు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురు టీచర్లకు గాయాలు


బోల్తా పడిన కారు

వెదురుకుప్పం, జూలై 30: రోడ్డు ప్రమాదంలో నలుగురు టీచర్లతో సహా మరొకరు గాయపడ్డారు. తిరుమలయ్యపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న టీచర్లు మోహన్, నారాయణరెడ్డి(ఫిజికల్ సైన్స్), వాణి(బయలజికల్ సైన్స్), వైదేహి (హిందీ)లతో పాటు జూనియర్ అసిస్టెంటు రామాంజనేయులు మంగళవారం ఉదయం తిరుపతి నుంచి కారులో బయలుదేరి వస్తున్నారు. పచ్చికాపల్లం-తిరుపతి రహదారిలో ఎర్రగుంటపల్లి సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి కారు అదుపు తప్పి బోల్తా పడింది. కారులో ఉన్న నలుగురు టీచర్లు, జూనియర్ అసిస్టెంట్ గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించినట్లు చెప్పారు.

ప్రకృతి వ్యవసాయంపై అధ్యయనం

- కుప్పంలో రాజస్థాన్ రైతుల బృందం పర్యటన


ఉద్యాన పంటలను పరిశీలిస్తున్న రాజస్థాన్ రైతులు

కుప్పం, జూలై 30: ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అధ్యయనం చేయడానికి కుప్పం నియోజకవర్గంలో రాజస్థాన్ రైతుల బృందం పర్యటిస్తోంది. అక్కడి వ్యవసాయాధికారుల ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీన నియోజకవర్గంలో అడుగుపెట్టిన ఈ బృందం ఆగస్టు 3వ తేదీదాకా ఇక్కడే ఉండి సంప్రదాయ వ్యవసాయ పంటలు, ఉద్యాన పంటలలో ప్రకృతి సాగు విధానాలను అధ్యయనం చేస్తుంది. ఇందులో భాగంగా మంగళవారం రామకుప్పం మండలంలోని విజలాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని అంకిరెడ్లపల్లె గ్రామంలో మల్బరీతోపాటు 42 రకాల కూరగాయలు, పండ్ల మొక్కల నమూనాలను పరిశీలించి ఉపయోగాలు తెలుసుకున్నారు. ఏ గ్రేడ్, ఏటీఎం, పీఎండీఎస్ పొలాలను సందర్శించి ఆయా రకాల సాగు విధానాలను అధ్యయనం చేశారు. డ్రమ్ సీడ్ విధానాన్ని పరిశీలించారు. శాంతిపురం మండలం జంగాలపల్లె గ్రామంలో సత్యనారాయణ అనే రైతు పొలంలోనూ ఏటీఎం, ఏ గ్రేడ్ మోడల్ ద్వారా కూరగాయల సాగు విధానం అధ్యయనం చేశారు. కనమలదొడ్డి గ్రామంలో అమృతమ్మ అనే మహిళా రైతు పొలంలో ఉద్యాన పంటలు, ముత్తమ్మ అనే మహిళా రైతు పొలంలో అరటి పంటలో అంతర్ పంటలుగా కూరగాయలు, ఆకు కూరల సాగు విధానం పరిశీలించారు. కుప్పం మండలం సీగలపల్లె గ్రామంలో కృష్ణమూర్తి పొలంలో కూరగాయలు, వేరుశనగ సాగులో యూనివర్సల్ పద్ధతులను అధ్యయనం చేశారు. స్వయంసహాయ సంఘాల మహిళలు, క్షేత్రస్థాయి సిబ్బందితో ప్రకృతి వ్యవసాయం గురించి రాజస్థానం రైతుల బృందం చర్చించింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీమ్ లీడర్ ఎల్.శ్రీనివాసులు, జిల్లా ప్రాజెక్ట్ మేనేజరు వాసు, ఎస్ఎఫ్‌వో గురుప్రసాద్, వ్యవసాయ పరిశోధకురాలు పుష్ప, రాష్ట్రస్థాయి కల్పన, రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రమాదాలు జరక్కుండా జాగ్రత్తలు పాటించండి

తిరుపతి, రేణిగుంటలో డీఆర్ఎం తనిఖీలు



సీఆర్ఎస్‌లో కార్మికుల వినతులు పరిశీలిస్తున్న డీఆర్ఎం - తిరుపతిలో నూతన భవన నిర్మాణాలను పరిశీలిస్తున్న విజయకుమార్

తిరుపతి(సెంట్రల్), జూలై 30: దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ మేనేజరు (డీఆర్ఎం) విజయకుమార్ మంగళవారం తిరుపతి, రేణిగుంట రైల్వేస్టేషన్లతోపాటు రైల్వే కోచ్ రిపేరు షాపు (సీఆర్ఎస్)లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. తొలి పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. సీఆర్ఎస్‌లోని పలు విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్మికసంఘాల నేతలు తమ సమస్యలపై డీఆర్ఎంకు వినతి పత్రాలిచ్చారు. తర్వాత తిరుపతికి చేరుకుని నూతన భవన నిర్మాణాలను తనిఖీ చేశారు. వంద శాతం నాణ్యతతోపాటు పనుల్లో వేగం పెంచి, నిర్దేశించిన సమయంలోపు పూర్తి చేయాలని ఆదేశాలిచ్చారు. తిరుపతి రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న నిర్మాణాలపై డివిజన్, స్థానిక అధికారులతో రైల్వే సేఫ్టీపై సమీక్షించారు. యార్డులో రైలు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలిచ్చారు. అలాగే రేణిగుంట రైల్వేస్టేషన్ అధికారులతో సమీక్షించారు. సీఆర్ఎస్ మేనేజరు దేవసాయం, తిరుపతి స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, సీనియస్ స్కేల్ అధికారులు మనోజ్, శ్రావణ్ కుమార్, చంద్రశేఖర్, డిప్యూటీ సీఈ ఉపేంద్రకుమార్, ఎస్ఎంఆర్ కె.చిన్నప్పరెడ్డి, మాధవరావు, సురేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేత లీలలపై కదిలిన యంత్రాంగం

రూ.కోటి స్థలం స్వాహాపై ఆర్సీపురం మండలంలో ఆర్డీవో పరిశీలన


నేటి విచారణకు డాక్యుమెంట్లు తేవాలని ఇరువర్గాలకు, అధికారులకు ఆదేశం


వివాదాస్పద స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో నిశాంత్ రెడ్డి

తిరుపతి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం మండల పరిధిలోని భూమికి తిరుపతి రూరల్ మండలం తహసీల్దార్ ధ్రువీకరించినట్లు నకిలీ రికార్డు తయారైన వ్యవహారంపై రెవెన్యూ యంత్రాంగంలో కదలిక వచ్చింది. 'వైసీపీ నేత లీలలు' శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై కలెక్టర్ వెంకటేశ్వర్ స్పందించారు. స్థల వివాదానికి సంబంధించిన నివేదిక సమర్పించాలని ఆర్డీవో నిశాంత్‌రెడ్డిని ఆదేశించారు. దాంతో మంగళవారం ఆర్డీవో.. రామచంద్రాపురం మండలం సి.రామాపురంలోని సర్వే నెంబరు 73/3 భూమిని పరిశీలించారు. బాధితుడు కె.పురుషోత్తమ రెడ్డిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆర్సీపురం మండలంలో ఉన్న తన భూమిలోని 10 సెంట్లను తిరుపతి రూరల్ మండల తహసీల్దార్ ఇచ్చినట్టు నకిలీ 1-బీ, అడంగల్‌ను ప్రైవేట్ మీ-సేవ లేదా ఇంటర్నెట్ సెంటర్లో సృష్టించారన్నారు. దీనికి ఆర్సీపురం, రూరల్ మండలాల ఉద్యోగులు కుమ్మక్కయ్యారని ఆయన ఆరోపించారు. అనంతరం ఆ భూమిని డిల్లీరాణి (భర్త వైసీపీ నేత భానుకుమార్ రెడ్డి) పేరున డాక్యుమెంట్ నెంబరుగా (2282/2022)గా రిజిస్టర్ చేశారని, తమకు న్యాయం చేయాలని కోరారు. దీంతో పూర్తి స్థాయి డాక్యుమెంట్లను బుధవారం ఆర్డీవో కార్యాలయంలో జరిగే విచారణకు తేవాలని ఇరువర్గాలతోపాటు అక్కడి రెవెన్యూ అధికారులను ఆర్డీవో ఆదేశించారు.

డొనేషన్లు సంపాదించడమే టీటీడీ పని కాదు

టీటీడీ మాజీ ఈవో ఎల్వీ సుబ్రహ్మణ్యం



తిరుమల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): 'డొనేషన్లు సంపాదించడమే టీటీడీ పని కాదు. ఈ విషయాన్ని నేను చాలాసార్లు చెబుతూ వచ్చా. ఆ కార్యాన్ని స్వామి చూసుకుంటాడు. వచ్చిన దాంతో భక్తులకు ఎలా సేవలందించాలి, సంప్రదాయాలను ఎలా నిలబెట్టాలి, స్వామి ఉత్సవాలను ఎంత చక్కగా నిర్వహించాలి, ఇతర ప్రాంతాలకు స్వామి వైభవాన్ని ఎలా విస్తరింపజేయాలి అనే అంశాలపై టీటీడీ ఈవో, అదనపు ఈవో దృష్టిసారించాలి' అని టీటీడీ మాజీ ఈవో, ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం అభిప్రాయపడ్డారు. తిరుమల శ్రీవారిని మంగళవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ప్రతి ఒక్కరూ స్వామికి చక్కని కైంకర్యాలు, భక్తులకు సేవలందించడంలో జాగ్రత్తగా వ్యవహరించాలని మనవి చేసుకుంటున్నానన్నారు. ప్రభుత్వ పక్షాన మరిన్ని సేవలు అందాల్సిన అవసరముందన్నారు. ధర్మప్రచారానికి ప్రధాన వేదిక టీటీడీ కావాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. ఈవోను సోమవారం కలిశానన్నారు. అలాగే అదనపు ఈవోను కూడా కలిసేందుకు ఉత్సాహంగా ఉన్నట్టు చెప్పారు. భక్తులకు ఎలాంటి సేవలందించాలనే అంశాలపై చక్కని ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. అధికారులు ధర్మమార్గంలో నడవడమే కాకుండా భక్తులందరినీ కూడా తీసుకెళ్లే ప్రయత్నం చేయాలన్నారు. అధికారులు కలిసికట్టుగా పని చేస్తే అనేక సేవలు భక్తులకు అందుతాయన్నారు. కొత్తగా వచ్చిన అధికారులకు మంచి అనుభవం ఉందని, బాగా చేస్తారనే నమ్మకం తనకుందన్నారు. పలువురు పండితులు రాసిన అనేక గ్రంథాలు టీటీడీ వద్ద వున్నాయని, వాటిని అనేక భాషల్లో ముద్రించి సరసమైన ధరకు విక్రయించాల్సిన అవసరముందన్నారు. శ్రీవారిమెట్టు మార్గం ద్వారా కాలినడకన తిరుమలకు వచ్చి వరాహస్వామిని, శ్రీవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. దేశ ప్రజలందరికీ స్వామి ఆశీస్సులుండాలని ప్రార్థించానన్నారు.

ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చిత్తూరు బుడతడు


గుర్తింపు పత్రం, శరణ్‌తో తల్లిదండ్రులు

చిత్తూరు సిటీ, జూలై30: ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో చిత్తూరు బాలుడు శరణ్ గొరజాల స్థానం సంపాదించాడు. కొంగారెడ్డి పల్లెకు చెందిన బాలుని తల్లిదండ్రులు స్వరూప్, ప్రియాంక మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఈ విషయం తెలిపారు. శరణ్ 21 నెలల వయసులో 28 సెకండ్లలో 50 మీటర్ల పరుగు పూర్తిచేసి గత రికార్డును అధిగమించాడన్నారు. ఈ వీడియోను తాము రికార్డ్‌చేసి ఇంటర్నేషనల్ బుక్‌ఆఫ్ రికార్డ్‌కు పంపించి దరఖాస్తు చేశామన్నారు. ఆ సంస్థ పరిశీలించి తమ కుమారునికి అవార్డు ఇచ్చిందని ఆనందం వ్యక్తం చేశారు.

తహసీల్దార్ల పోస్టింగ్స్‌పై సర్కారు కొత్త నిబంధనలు

ఎన్నికల ముందు పనిచేసిన మండలం, సొంత రెవెన్యూ డివిజన్, నియోజకవర్గంలో ఇవ్వరు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 30: ఎన్నికల నేపథ్యంలో ఇతర జిల్లాల నుంచి సొంత జిల్లాకు వచ్చే 42 మంది తహసీల్దార్లకు పోస్టింగ్స్ ఇచ్చే విషయమై సర్కారు కొత్త నిబంధనలు విధించింది. ఎన్నికల ముందు పనిచేసిన మండలం, సొంత రెవెన్యూ డివిజన్, నియోజకవర్గ పరిధిలో పోస్టింగ్ ఇవ్వకూడదని నిర్ణయించింది. దీనికి సంబంధించిన ఉత్తర్వులను మంగళవారం రాత్రి అన్ని జిల్లాల కలెక్టర్లకు పంపింది. ఇందుకోసం నెల్లూరు, చిత్తూరు ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అధికారులతో కమిటీ వేసింది. ఈ కమిటీ నిర్ణయం మేరకు పోస్టింగ్స్ ఉంటాయి. ఈ లెక్కన చూస్తే చాలామంది తహసీల్దార్లు పక్క జిల్లాకు వెళ్లే పరిస్థితి కనబడుతోంది. ఈ నేపథ్యంలో వైసీపీతో అంటకాగిన తహసీల్దార్ల గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్లయ్యింది.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.48 కోట్లు

తిరుమల,జూలై30(ఆంధ్రజ్యోతి):తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.48 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం లెక్కించి, మంగళవారం ఉదయం ప్రకటించింది. సోమవారం 65,874 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 23,782 మంది తలనీలాలు సమర్పించారు.

తిరుమల వీజీవోగా రాంకుమార్

తిరుపతికి సురేంద్ర



తిరుపతి(నేరవిభాగం), జూలై 30: తిరుమల విజిలెన్సు అండ్ సెక్యూరిటీ అధికారి (వీజీవో)గా ఎస్‌టీవీ రాంకుమార్‌ను ప్రభుత్వం నియమించింది. అక్కడ పనిచేస్తున్న గిరిధర్‌ను మాతృసంస్థ పోలీసు శాఖకు బదిలీ చేసింది. అలాగే తిరుపతి వీజీవోగా ఎ.సురేంద్రను నియమించింది. ఇక్కడ దీర్ఘకాలంగా వీజీవోగా పనిచేస్తున్న బాలిరెడ్డిని మంగళగిరిలోని డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని మంగళవారం రాత్రి ఇచ్చిన ఆదేశాల్లో పేర్కొంది. ఈ ఉత్తర్వులు తక్షణం అమల్లోకి వస్తాయనీ తెలిపింది.

పశు వైద్యశాలల్లో మందుల కొరత

● సకాలంలో వైద్యం అందక మూగజీవాల రోదన ● పాడిపశువుల మందుల కొనుగోలు కోసం పాడిరైతులు పాట్లు

రామసముద్రం, జూలై 30: పశు వైద్యశాలల్లో మందుల కొరత వేధిస్తోంది. దీంతో పాడిపశువులకు సకాలంలో సక్రమంగా వైద్యమందక మృత్యువాత పడుతుండడంతో పాడిరైతులు ఇక్కట్లు పడుతున్నారు. రామసముద్రం మండలంలో సుమారుగా 15వేల పశు సంపద ఉంది. మండల ప్రజలలో 80శాతం మంది పశుపోషణతో జీవనం సాగిస్తున్నారు. మండలంలో రోజుకు సుమారుగా 20వేల లీటర్లుకు పైగా పాల ఉత్పత్తి అవుతోంది. మండలంలో రెండు వెటర్నరి డిస్పెన్సరీలు ఉన్నాయి. వాటిలో ఒకటి మండల కేంద్రంలో మరొకటి చెంబకూరులో ఉంది. అయితే రామసముద్రంలో గత కొన్నేళ్లుగా వైద్యులు లేక ఖాళీగా ఉంది. కాగా చెంబకూరులో ఉన్న పశు వైద్యురాలుకు రామసముద్రం డిస్పెన్సరీకి అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆమె రెండు చోట్ల విధులు నిర్వర్తించడం కష్టంగా ఉండడంతో పాడిపశువులకు వైద్య సేవలు సకాలంలో అందడంలేదని పాడిరైతులు వాపోతున్నారు. ఇదిలా ఉండగా గత మూడు రోజుల క్రితం చెంబకూరు పశువైద్యాధికారి కూడా దీర్ఘకాలిక సెలవుపై వెళ్లినట్లు సమాచారం. ఆమె స్థానంలో ఇంత వరకు ఎవ్వరిని నియమించలేదు. ఇక మండలంలో రెండు ప్రాంతీయ పశువైద్య కేంద్రాలు ఉన్నాయి. ఇందులో ఒకటి కేసీపల్లెలో మరొకటి అరికెల గ్రామంలో ఉంది. అయితే వాటిలో వైద్యులు ఉండరని ఆరోపణలున్నాయి. ఇవి కాకుండా మండలం 14 ఆర్‌బీకేలలో పశు వైద్య కేంద్రాలు ఉన్నాయి. ప్రతి ఆర్‌బీకేలోను ఒక పశు వైద్య సహాయకుడితోపాటు అత్యవసర పరిస్థితుల్లో పశు వైద్యం కోసం సంచార వైద్య సేవ వాహనం ఒకటి ఉంది. ఇన్ని ఉన్నా వాటికి కావలసిన మందులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో పశువులకు వైద్యం కోసం రైతులు వేలకు వేలు ఖర్చు చేసి ప్రైవేట్ మందుల షాపులలో కొనుగోలు చేయాల్సి వస్తోంది. అంతేకాకుండా ఆర్‌బీకేలలో ఉన్న వైద్య సిబ్బంది సకాలంలో అందుబాటులో ఉండడం లేదనే ఆరోపణలున్నాయి. అంతేకాక వారిలో చాలా మందికి వైద్య సేవలో తగిన శిక్షణ, అనుభవం లేదని, వ్యాధి గ్రస్థ పశువుకు ఫలానా వ్యాధి అని సరిగా గుర్తించలేక పోతున్నారని రైతులు చెబుతున్నారు. అనాలోచిత వైద్యంతో పశువులు మృత్యువాత పడుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ కారణంగానే పశు వైద్య కేంద్రాలకు వచ్చే ఓపీ శాతం గణనీయంగా తగ్గిపోతోంది. ఇలా అందుబాటులో లేని వైద్యులు, మందుల కొరత తదిర కారణాలతో పశు వైద్యం అందక మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయని పలువురు వాపోతున్నారు. గత ఏడాది జూన్ ఒకటిన మండలంలోని బి.కురప్పల్లెలో మునిరత్నం అనే రైతు పాడి ఆవు వ్యాధిన పడగా సకాలంలో వైద్యం అందక అది మృతిచెందింది. అలాగే మండలంలోని బలసముద్రం పంచాయతీ ఆర్.నడింపల్లెకు చెందిన శ్రీరాములు అనే రైతుకు చెందిన పాడి ఆవు లంపిస్కిన్ వ్యాధితో 2022 నవంబర్ 24న చనిపోయింది. ఆ విషయమై గ్రామ సచివాలయ వెటర్నరీ సిబ్బందికి విషయం చెప్పి నష్ట పరిహారం చెల్లించాలని కోరినా ఇంత వరకు ఎటువంటి నష్ట పరిహారం రాలేదని అతను వాపోయాడు. ఇలాంటి ఘటనలు మండలంలో చాలా వరకు జరిగినా వాటికి ఇంత వరకు పరిహారం అందలేదని రైతులు వాపోతున్నారు.


చెంబకూరులోని పశు వైద్యశాల

వెటర్నరీ అసిస్టెంట్‌ను నియమిస్తాం

రామసముద్రం మండలంలోని వైద్యాధికారి గత మూడు రోజుల క్రితం దీర్ఘకాలిక సెలవు పెట్టారు. ఈ స్థానంలో వెటర్నరి అసిస్టెంట్‌ను త్వరగా నియమిస్తాం. మందుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటాము. అలాగే ఆర్‌బీకేలలోని పశు వైద్య అసిస్టెంట్‌లకు వృత్తి నైపుణ్యంపై శిక్షణ అందిస్తాం.

-రోహిణి, పశువైద్యాధికారిణి, మదనపల్లె డివిజన్

సమాజంలో మానవతా విలువలు పెరగాలి


మానవ అక్రమ రవాణా వ్యతిరేక పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, పోర్డు సిబ్బంది

మదనపల్లె టౌన్, జూలై 30: సమాజంలో మానవతా విలువలు పెరిగినపుడే మానవ అక్రమ రవాణాకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. మంగళవారం స్థానిక నెహ్రూ మున్సిపల్ యూపీ స్కూల్లో పోర్డు సంస్థ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చేతుల మీదుగా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఐదేళ్లలో 30వేల మంది మహిళలు మిస్సింగ్ అయ్యారని, ఇంత వరకు వారి ఆచూకీ తెలియలేదన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలంటే అందరు సమష్టిగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసులు, పోర్డు డైరెక్టర్ లలితమ్మ, టీడీపీ నాయకులు, పోర్డు సిబ్బంది పాల్గొన్నారు. కాగా మానవ అక్రమ రవాణా నేరమని గ్రామజ్యోతి సంస్థ వ్యవస్థాపకురాలు సుభద్ర పేర్కొన్నారు.మంగళవారం పట్టణంలో పలు ప్రాంతాల్లో పోస్టర్లను ఆవిష్కరించి, అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాలూకా సీఐ శేఖర్, సీడీపీవో సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ .. పలువురికి గాయాలు

కలకడ, జూలై 30: మండలంలోని అక్కన్నగారికోటకు చెందిన సిద్దయ్యనాయుడు పొలంలో రామారావు పశువులు మేయడంతో గొడవ పడ్డట్లు సమాచారం. ఈ క్రమంలో సిద్దయ్యనాయుడుకు అతని వర్గంలోని తిరుపతినాయుడు, అతని భార్యకు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం 108లో పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



భూములను ఆక్రమించారు.. న్యాయం చేయండి


సబ్‌కలెక్టరేట్ వద్ద కంటేవారిపల్లె గ్రామస్థులు

మదనపల్లె టౌన్, జూలై 30: తమ భూములను వైసీపీ నాయకులు ఆక్రమించుకున్నారని ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని కంటేవారిపల్లె గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు మంగళవారం స్థానిక సబ్‌కలెక్టరేట్ వద్ద కురబలకోట మండలం ఎర్రబల్లి పంచాయతీ కంటేవారిపల్లెకు చెందిన గ్రామస్థులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నెంబర్ 1881-1లో 60 సెంట్లు, 1881-1a లో 1.33 ఎకరాల భూమి తమ తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్నామన్నారు. మూడేళ్ల క్రితం ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి అనుచరుడు భానుప్రకాష్ మా భూమిని ఆక్రమించుకున్నాడని ఆరోపించారు. దీనిపై విచారించి తమకు న్యాయం చేయాలని బాధితులు గుడేప్రసాద్, చక్రవర్తి, రవికుమార్, కుమార్, అరవింద్ పేర్కొన్నారు.

ఇంటి నిర్మాణాలు సత్వరం పూర్తి చేయాలి

ములకలచెరువు, జూలై 30: పక్కా గృహాల నిర్మాణాలను డిసెంబర్ ఆఖరులోగా పూర్తి చేయాలని ఎంపీడీవో పోలప్ప, హౌసింగ్ ప్రత్యేకాధికారి రసీద్‌ఖాన్‌లు పేర్కొన్నారు. మండలంలోని బురకాయలకోట, వేపూరికోటలోని లే అవుట్‌లో జరుగుతున్న పక్కా గృహాల నిర్మాణాలను మంగళవారం వారు పరిశీలించారు. లబ్ధిదారులు త్వరితగతిన ఇంటి నిర్మాణాలు పూర్తి చేయలన్నారు. ఇంటి నిర్మాణాలతో పాటు మరుగుదొడ్డు నిర్మించుకుంటే లబ్ధిదారులకు అదనంగా రూ.12వేలు ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

9న చలో కలెక్టరేట్ కార్యక్రమం

మదనపల్లె అర్బన్, జూలై30: బొప్పాయి రైతులను ఆదుకోవాలని ఆగస్టు 9న జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు ఏపీ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన మదనపనల్లెలో మీడియాతో మాట్లాడుతూ ఎకరానికి రెండు లక్షల పరిహారం చెల్లించాలని రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాసిరకం నారు అమ్ముతున్న నర్సరీ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమల్ల రంగారెడ్డి మాట్లాడుతూ బొప్పాయి సాగుచేసే రైతుల్లో 99 శాతం కౌలు రైతులేనని, వారికి ప్రభుత్వం ఎవ్వరికి కౌలు రైతుల గుర్తిపు కార్డులు ఇవ్వలేదన్నారు. దీంతో వీరికి పంటరుణాలు, పెట్టుబడి సాయం అందక ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బొప్పాయి రైతు సంఘం నాయకులు రామకృష్ణ, గంగిరెడ్డి, అనిల్‌కుమార్, వేణుగోపాల్, వెంకటరమణ, గంగరాజు, రామమూర్తి, నారాయణ, గునాథం, చంద్రయ్య, రాఘవేంద్ర యాదవ్, సుధాకర్, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

1న ఇళ్ల వద్దకే నేరుగా పెన్షన్

తంబళ్లపల్లె జూలై 30 : తంబళ్లపల్లె మండలంలో ఆగస్టు 1వ తేదీన ఇళ్ల వద్దకే పించన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో కృష్ణమూర్తి తెలిపారు. మండల వ్యాప్తంగా వృద్ధాప్య, వికలాంగ, వితంతు అన్ని రకాల పెన్షన్‌లు కలిపి 6225 ఉన్నాయని, గ్రామ వార్డు, సచివాలయ సిబ్బందితో పించన్ పంపిణీ చేస్తామని తెలిపారు. వారికి ఆగస్టు నెలకు సంబందించి, మండలానికి రూ.2,7013,500 నిధులు విడుదలయ్యాయని పేర్కొన్నారు.

కురబలకోటలో: మండలంలోని పింఛన్‌దారులు తమ ఇళ్ల వద్దనే ఉండి పింఛన్‌లు తీసుకోవాలని ఎంపీడీవో హరినారాయణ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆగస్టు 1న ప్రభుత్వం వృద్ధాప్య, వికలాంగు, వితంతులకు పింఛన్‌లను అందజేస్తుందన్నారు. మండలంలో 6512మంది పించ న్‌దారులు ఉన్నారని, వారికి తమ సిబ్బంది ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు ఇస్తారన్నారు.

కలకడలో: వివిధ సామాజిక భద్రత పింఛన్లను సచివాలయ సిబ్బంది సకాలంలో పంపిణీ చేయాలని ఎంపీడీవో పరమేశ్వరరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. సిబ్బంది ఆగస్టు 1నఉదయం 5.30 నుంచి పంపిణీ ప్రారంభించాలన్నారు. సమాచారాన్ని లబ్ధిదారులకు ముందుగానే తెలిపి అందరూ అందుబాటులో ఉండేలా జాగ్రత్త వహించాలన్నారు. 1న 99శాతం పింఛన్లు పంపిణీ చేయాలన్నారు.

రోడ్డుప్రమాదంలో ఒకరి మృతి


రామక్రిష్ణ (ఫైల్‌ఫోటో)

బి.కొత్తకోట, జూలై30:బి కొత్తకోటవాసుల పై వాహనం దూసు కురావడంతో ఒక వ్యక్తి మృతిచెందాడు. వివరాలిలా వున్నాయి...బి.కొత్తకోట పట్టణంలోని పాశం వీధికి చెందిన పిల్లు అలియాస్ మహమ్మద్‌వలి సోమవారం సత్య సాయి జిల్లాలో గుజిరిని కొనుగోలు చేసి ఓ వాహనంలో వస్తుండగా తనకల్లు మండలం కొక్కంటిక్రాస్ వద్ద వాహనం ఆగిపోయింది. దీంతో బి.కొత్తకోట బీసీ కాలనీకి చెందిన గుంటిపల్లి రామక్రిష్ణ(40)కు ఫోన్‌చేసి వాహనాన్ని తీసుకురమ్మన్నాడు. వాహనం రాగానే అక్కడున్న పిల్లు, మరో యువకుడు ఆరిఫ్‌తో కలిసి గుజిరి సామగ్రి షిఫ్ట్ చేస్తుండగా అదే సమయంలో కదిరి వైపునుంచి వచ్చిన ఓ వాహనం వారిని ఢీకొట్టింది. ఈ ఘటనలో రామకృష్ణ అక్కడి కక్కడే మృతిచెందగా తీవ్రంగా గాయపడిన మహ్మద్‌వలిని బెంగళూరుకు, ఆరిఫ్‌ను కదిరి ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు కదిరిలో పోస్టుమార్టం అనంతరం రామకృష్ణ మృతదేహాన్ని బి.కొత్తకోటకు తరలించి మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. రామకృష్ణకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తనకల్లు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


సుధాకర (ఫైల్ ఫోటో)

పీలేరు, జూలై 30: విద్యుతాఘాతంతో సుధాకర(55) అనే వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. పీలేరు మండలం దొడ్డిపల్లె పంచాయతీలోని ఇందిరమ్మ కాలనీలో కంచంవారిపల్లెకు చెందిన సుధాకర(55) నూతనంగా ఇంటిని నిర్మించుకుంటున్నాడు. ఇటీవల మోల్డింగ్ పనులు పూర్తవడంతో మంగళవారం అతను మోల్డింగ్ అనంతరం చేపట్టే వైరింగ్ పనులు చేపడుతుండగా ఇంటికి ఎదురుగా ఉన్న విద్యుత్ లైన్‌ను తాకి విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. కుటుంబసభ్యులు గుర్తించి ఆసుపత్రికి తరలించేలోపు అతను మృతి చెందాడు. సుధాకరకు భార్య అనసూమయ్య, కొడుకు హర్షవర్ధన్, కుమార్తె భార్గవి ఉన్నారు. సోమల వద్ద ఉన్న పొలాన్ని అమ్మి ఇల్లు కట్టుకుంటూ ఉండగా ప్రమాదం జరిగి తమ తండ్రి అకాల మరణం చెందాడని వారు కన్నీరుమున్నీరయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసి సుధాకర మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

శ్రీనగర్ కాలనీలో చోరీ

మదనపల్లె అర్బన్, జూలై 30: మండలంలోని తట్టివారిపల్లె గ్రామం శ్రీనగర్ కాలనీలో ఓ ఉపాధ్యాయుని ఇంట్లో చోరీ జరిగి ఇంట్లో ఉన్న బంగారు, వెండి ఆభరణాలతోపాటు నగదు కలిసి 20 లక్షలు వరకు దొంగలు దోచుకెళ్లారని బాధితుడు గురుమూర్తి తెలిపాడు. ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి కలికిరి యల్లమ్మ జాతరకు వెళ్లామని ఇదే అదునుగా చూసిన దొంగలు ఇంటి తాళాలు పగల గొట్టి ఇంట్లోని బంగారు. వెండి నగలుతోపాటు నగదును అపహరించారన్నారు. సోమవారం రాత్రికి ఇంటికి వచ్చి చూడగా ఇంటి తలుపులు తెర్చి ఉండడంతోపాటు బీరువాలో బట్టలు చెల్లాచెదురుగా ఉండడంతో దొంగలు పడి దోచుకున్నట్లు తెలుసుకుని రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా మంగళవారం తాలుకా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు.

ఎస్పీడీసీఎల్ ఈఈగా గంగాధర్

మదనపల్లె టౌన్, జూలై 30: మదనపల్లె ఎస్పీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా అనంతపురం రూరల్ ఈఈ గంగాధర్‌ను బదిలీ చేస్తూ ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు ఉత్తర్వులు జారీ చేశా రు. మదనపల్లెలో ఈఈగా పనిచేస్తున్న యుగంధర్‌ను తిరుపతి విజిలెన్స్ విభాగానికి బదిలి చేశారు. గురువారం మదనపల్లె ఈఈగా బాధ్యతలు చేపడుతానని గంగాధర్ తెలిపారు. గతంలో గంగాధర్ మదనపల్లె టౌన్, రూరల్ ఏడీఈగా పనిచేశారు.

కలికిరిలో డీపీవో ధనలక్ష్మి ఆకస్మిక తనిఖీలు


కలికిరిలోని రోడ్డు పక్కనదుకాణాలను పరిశీలిస్తున్న డీపీవో ధనలక్ష్మి

కలికిరి, జూలై 30: జిల్లా పంచాయతీ అధికారిణి ధనలక్ష్మి మంగళవారం కలికిరి గ్రామ పంచాయతీలో విస్తృతంగా పర్యటించి ఆకస్మిక తనిఖీలు చేశారు. ఇందులో భాగంగా పంచాయతీలోని పారిశుధ్య కార్యక్రమాలు తనిఖీ చేసి పీఆర్-1 , ఓడీఎఫ్ ప్లస్ యాప్‌లను స్వయంగా పరిశీ లించారు. అలాగే వాటిపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈవో గురుమోహన్, సచివాలయ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పించి ఆదుకోవాలని ఓ మహిళ వినతి


ఆయేషాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి

కలికిరి, జూలై 30: విద్యుత్ ప్రమాదంలో తన భర్త మరణించడంతో ఇద్దరు పిల్లలను పోషించుకోవడం కష్టంగా ఉందని, ఏదైనా ఉపాధి కల్పించి ఆదుకోవాలని ఆసియా అనే మహిళ ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డిని కలిసి విన్నవించుకుంది. మంగళవారం కేవీపల్లె మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన తన భర్త జాఫర్ మూడు నెలల క్రితం జరిగిన ఓ విద్యుత్ ప్రమాదంలో మరణించాడని ఆసియా తెలిపింది. ఆ సమయంలో తమ కుటుంబానికి ఆర్థిక సాయం చేసి ఆదుకున్నారని, అదే విధంగా తనకు ఏదైనా ఉపాధి మార్గం కల్పిస్తే పిల్లల్ని చదివించుకుంటానని ఆమె ఎమ్మెల్యేకు తన కష్టాలను విన్నివించుకుంది. తనకు 9వ తరగతి చదివే కుమారుడు, ఏడవ తరగతి చదువుతున్న కుమార్తె ఉన్నారని ఆమె తెలిపింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిశోర్ కుమార్ రెడ్డి ఆమెతో మాట్లాడుతూ ముందుగా పిల్లల చదువులకు సాయం అందిస్తామని, త్వరలోనే ఏదైనా ఉపాధి మార్గం కల్పిస్తానని హామీ ఇచ్చారు.

గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించండి

తంబళ్లపల్లె, జూలై 30: తంబళ్లపల్లె మం డలంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాలని తంబళ్లపల్లె టీడీపీ నాయకులు ఎంపీడీవో క్రిష్ణమూర్తిని కోరారు. మంగళవారం మండ ల టీడీపీ నాయకులు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవోను కలిసి మండలంలో నెలకొన్న సమస్యలను వివకరించారు. మండలంలోని పలు గ్రామాల్లో వీధి లైట్లు వెలగ డంలేదని, పలు చోట్ల తాగు నీటి లీకేజీలతో పాటు నీటి సమస్య ఉందని అదేవిధంగా రోడ్లు, మురుగునీటి కాలువలు తదితర సమస్యలను ఎంపీడీవో దృష్టికి తీసుకువెళ్లారు. పంచాయతీలలో ప్రస్తుతం నిధులు లేవని...అయినా ఆయా కార్యదర్శుల ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీడీవో వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాజం పేట పార్లమెంటు ఉపాధ్యక్షుడు కొటాల శివకుమార్, క్లస్టర్ ఇంచార్జి బేరిశీన, మాజీ జడ్పీ టీసీ సభ్యుడు రామచంద్ర, సాంబశివారెడ్డి, వెంకటరెడ్డి, శంకర్‌రెడ్డి, రాజన్న పాల్గొన్నారు.

పీలేరు ప్రజల రుణం ఎప్పటికీ తీర్చుకోలేనిది


నాగేంద్రను పరామర్శిస్తున్న నల్లారి తనూజా రెడ్డి

పీలేరు, జూలై 30: 'ఇటీవల జరిగిన ఎన్నికల్లో పీలేరు మండల ప్రజలు మా కుటుంబంపై చూపిన ప్రేమ ఎనలేనిదని వారి రుణం ఎప్పటికీ తీర్చుకోలేనిదని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి సతీమణి నల్లారి తనూజారెడ్డి తెలిపారు. పీలేరులో మంగళవారం ఆమె పర్యటించి పార్టీ కార్యాలయంలో మహిళలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కాగా అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్న పీలేరు మండల పార్టీ అధ్యక్షుడు వారణాశి శ్రీకాంత్‌రెడ్డి, పద్మావతి నగర్ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ నాగేంద్రలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమపై నమ్మకంతో తమను ఆదరించిన పీలేరును అభివృద్ధి పథంలో నడుపుతామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అమరనాథరెడ్డి, మల్లెల రెడ్డిబాషా, రియాజ్, చాన్‌బాషా, పురం రామ్మూర్తి, ఆబిద్, వెంకటరమణ నాయక్, పురం రెడ్డమ్మ, సాధన, రెడ్డిరాణి, స్వర్ణ, షమీమ్, రమాదేవి, లక్ష్మీకాంతమ్మ, ఖాదర్, ఆంజి, సురేశ్, బాలాజీ, మల్లిఖార్జున, గాండ్ల విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పీలేరులో జోరుగా జనసేన సభ్యత్వ నమోదు

పీలేరు, జూలై 30: జనసేన పీలేరు నియో జకవర్గ ఇన్‌ఛార్జ్ బెజవాడ దినేశ్ నేతృత్వం లో జనసైనికులు మంగళవారం పీలేరులో సభ్యత్వ నమోదు చేపట్టారు. పీలేరు వార పు సంతలో ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేసి తమ పార్టీలో సభ్యత్వం తీసుకుంటే కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా బెజవాడ దినేశ్ మాట్లాడుతూ తాము చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి పీలేరు నియోజకవర్గంలో విశేష స్పందన లభిస్తోందన్నారు. అనంతరం పలువురికి సభ్యత్వ నమోదు ప్రక్రియ పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు మోహనకృష్ణ, గజేంద్ర, పవన్, మున్నా పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్త పార్టీ సభ్యత్వ నమోదు చేసుకోండి

నిమ్మనపల్లి, జూలై 30: జనసేన కార్యకర్త లు పార్టీ సభ్యత్వ నమోదుతో చేసుకొంటే వారికి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తార ని జనసేన మండల అధ్యక్షుడు ప్రదీప్ తెలిపారు. మంగళవారం ముష్టూరు, కొండయ్యగారిపల్లి, తవళం పంచాయతిలో జనసేన కార్యకర్తల నుంచి పార్టీ సభ్యత్వ నమోదు కార్యకర్రమాన్ని చేపట్టారు. . సభ్యత్వం తీసుకోవడం వలన ప్రమాదవశాత్తు సభ్యత్వం కలిగిన వ్యక్తి మరణిస్తే రూ.5లక్ష ల వరకు భీమా పాలసీ, ప్రమాదంలో గాయపడిన వారికి రూ.50వేలను పార్టీ ఇస్తుందని తెలిపారు. జనసేన నాయకులు భరత్, అఫ్రోజ్, శివ, వెంకటరమణ పాల్గొన్నారు.

ఏపీయూడబ్ల్యూజే మహాసభలను జయప్రదం చేయండి

రాయచోటిటౌన్, జూలై30: ఏపీయూడబ్ల్యుజే అన్నమయ్య జిల్లా ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని యూనియన్ అన్నమయ్య జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు, కోకన్వీనర్లు వంశీ, లోకనాథ్‌లు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. రాయచోటి పట్టణంలోని ప్రీతం రెసిడెన్సీలో ఆగస్టు 1వ తేదీ ఉదయం 10 గంటలకు జరిగే ఏపీయూడబ్ల్యుజే జిల్లా ప్రథమ మహాసభలకు జిల్లాలోని అన్ని పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలకు చెందిన పాత్రికేయులు హాజరుకావాలని కోరారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర రవాణా, యువజన, క్రీడలశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి వీ. రామసుబ్బారెడ్డి, వైఎస్ఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ నాగిరెడ్డి, విశిష్ట అతిథులుగా కలెక్టర్ శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు హాజరవుతారన్నారు. మహాసభల సందర్భంగా ఉదయం జరిగే సమావేశం అనంతరం మధ్యాహ్నం జిల్లా కమిటీతో పాటు ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కమిటీలను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు హాజరుకావాలని వారు కోరారు.

వైభవంగా ఆడికృత్తిక వేడుకలు

మదనపల్లె అర్బన్, జూలై 30: మదనపల్లె పట్టణం, రూరల్‌లో మంగళవారం ఆడికృత్తిక వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మండలంలోని ఆరమాచార్లపల్లెలో వెలసిన సుబ్రహ్మణ్యంస్వామి ఆలయంలో ప్రత్యేకంగా అర్చనలు, అభిషేకాలు నిర్వహించి ఆలయ ధర్మకర్తలు రాచపల్లె సుబ్రహ్మణ్యం, అనురాధలు విశేషపూజలు చేశారు. ఉదయం నుంచే భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శనం చేసుకున్నారు.

వాల్మీకిపురంలో: వాల్మీకిపురం పట్టణ పడమర పొలిమేరల్లోని ధర్మపథం సమూహాలయంలో మంగళవారం షిరిడీసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఆడికృత్తిక మహోత్సవాలు వైభవంగా జరిగాయి. ఉదయం ఆలయంలో సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకం, అర్చన, తోమాల సేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం స్థానిక పట్టాభిరామాలయం వద్ద నుండి వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామిని పుష్ప పల్లకిలో పురవీధులలో నగరోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నప్రసాద వితరణ చేపట్టారు.

విద్యార్థులు సేవాభావం అలవర్చుకోవాలి

వాల్మీకిపురం, జూలై 30: ప్రతి విద్యార్థి సేవాభావం అలవర్చుకోవాలని వాల్మీకిపురం పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం సావిత్రి పేర్కొన్నారు.మంగళవారం పాఠశాలలో 10మంది ఎన్‌సీసీ క్యాడట్స్‌కి క్యాంపు సర్టిఫికెట్స్‌ను ప్రదానం చేశారు. ప్రతిభ కనబరిచిన క్యాడట్స్‌ను హెచ్ఎం సావిత్రి, ఉపాధ్యాయులు అభినందించారు.

గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలి

కలకడ, జూలై 30:గ్రామీణ ప్రాంతాల యువత అన్ని క్రీడల్లో రాణించి మంచి గుర్తింపు పొందాలని ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గంగాపురం పంచాయతీ పద్మావతీపురంలో జరిగిన దివంగత నల్లారి అమరనాథ్‌రెడ్డి క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విజేత జట్టుకు రూ.30 వేలు ప్రైజ్ మనీతోపాటు ట్రోపి, రన్నర్ జట్టు రూ.15 వేలను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో నాయకులు దగ్గుబాటు వెంకటేశ్వరరావు, కోటరమణనాయుడు, చంద్రప్పనాయుడు, పివినాయుడు, తారకేశ్వర, గీత, నిర్వాహకులు వెంకటేశ్వరరావు, భరత్‌రాజు, రెడ్డిశేఖర్‌లు పాల్గొన్నారు.

గడిసె దగ్ధం-రూ.70వేలు ఆస్తి నష్టం

వాల్మీకిపురం, జూలై 30: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరి గుడిసె దగ్ధమైంది. బాధితుడు కథనం మేరకు చింతపర్తి గ్రామ పంచాయతీ తాళ్లపల్లె హరిజనవాడకు చెందిన చంద్ర పూర్తి గుడిసెలో నివాసం ఉంటున్నాడు. మంగళవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో గుడిసె కాలి ఇంట్లోని బట్టలు, బియ్యం, టీవీ, సామాగ్రి తదితరం కాలి బూడిదయ్యాయి. దీంతో బాధితుడు చంద్రకు రూ.70వేలకు పైగా ఆస్తి నష్టం వాటిల్లింది. బాధితుడికి భార్య, ఇద్దలు పిల్లలు ఉన్నారు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

